నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 6-6-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 268 పేజీలు: 4 వెల: రూ.1/-

కాంగ్రెస్‌లో చేరిన మధ్యప్రదేశ్ మాజీ మంత్రి శుక్లా

భోపాల్,జూన్ 5: మధ్యప్రదేశ్ మాజీ మంత్రి, ప్రస్తుత బీజేపీ నేత బాలెందు శుక్లా శుక్రవారం ఆ పార్టీని వీడి తాజా మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. 2009 వరకు కాంగ్రెస్‌లోనే కొనసాగిన ఆయన పార్టీలో విభేదాల కారణంగా ఆ తరువాత బీజేపీలో చేరారు. గతంలో శుక్లా పార్టీని వీడడానికి గల కారణాలను పట్టించుకోబోమని సొంతగూటికి చేరుకున్నందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నామని కమల్‌నాథ్ అన్నారు.

గతంలో జ్యోతిరాదిత్య సింధియాతో ఉన్న విభేదాల కారణంగానే శుక్లా కాంగ్రెస్ పార్టీని వీడారు. సింధియా ప్రస్తుతం బీజేపీలోకి రావడంతో ఆ కోపంతోనే శుక్లా తిరిగి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలుస్తోంది. శుక్లా రాకతో రానున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మేలు జరుగుతుందని పార్టీ నాయకులు భావిస్తున్నారు. జ్యోతిరాదిత్య సింధియాతోపాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన 22మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేయడంతో కమల్‌నాథ్ ప్రభుత్వం పడిపోయిన సంగతి తెలిసిందే.

వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి. చిత్రంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం

అభివృద్ధి పనులకు మంత్రి సబిత శ్రీకారం

వికారాబాద్,జూన్5(ఆర్ఎన్ఎ): టీఆర్ఎస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ గిరిజన తండాల అభివృద్ధికి పాటుపడుతున్నదని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి అన్నారు. జిల్లాలోని బషీరాబాద్ మండలంలో పలు అభివృద్ధి పనులను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సబిత మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కృషి వల్లే రైతులు సంతోషంగా ఉంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రతి ఫ్లలెకు సాగు, తాగునీరు అందిస్తామని చెప్పారు.

సర్కారు సూచించిన పంటలతోనే రైతులకు లాభాలు వస్తాయని, రైతులు ఆలోచించి మార్కెట్ లో డిమాండ్ ఉన్న పంటలు వేయాలన్నారు. బషీరాబాద్ మండలం జీవన్గి చెక్ డ్యాం నిర్మాణానికి రూ. 8.74 కోట్లు, దామర్ చెడు నుంచి వాల్యానాయక్ తండా బీటీ రోడ్డుకు రూ. 1.15 కోట్లు, తొరియా నాయక్ తండా నుంచి పర్శునాయక్ తండా బీటీ రోడ్డుకు రు. 1.58 కోట్లు, బోజ్యానాయక్ తండా బీటీ రోడ్డుకు రూ.55 లక్షలు, నీళ్లపల్లి నుంచి అనిక్యా నాయక్ తండాకు కోటి రూపాయలతో చేపడుతున్న పనులకు ప్రారంభోత్సవాలు చేశారు.

పట్టిసీమ విషయంలో తమ వాటా రావాల్సిందే

గోదావరిలో కేటాయింపుల మేరకే ప్రాజెక్టులు
గోదావరి బోర్డుకు నివేదిక సమర్పణ
రాష్ట్ర నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రజత్ కుమార్



హైదరాబాద్,జూన్5(ఆర్ఎన్ఎ): పట్టిసీమ నీటి విషయంలో తెలంగాణ వాటా ఇవ్వాలని కోరామని తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్ చెప్పారు. పోలవరం నుంచి పట్టిసీమకు 80 టీఎంసీలు ఇస్తున్నారని తెలిపారు. సాగునీరు, ప్రాజెక్ట్‌ల విషయంలో నిర్లక్ష్యం కారణంగానే తెలంగాణ ఉద్యమం వచ్చిందని గుర్తుచేశారు. పాత ప్రాజెక్ట్‌లకు డీపీఆర్ అడగొద్దని చెప్పామని, కాళేశ్వరాన్ని కొత్త ప్రాజెక్ట్‌గా భావించొద్దని చెప్పామని పేర్కొన్నారు. లోకేషన్, డిజైన్ మార్పు లాంటి కారణాలతో కొత్త

ప్రాజెక్ట్‌గా పరిగణించొద్దని, గోదావరిలో తెలంగాణ వాటా ప్రకారమే ప్రాజెక్ట్‌లు నిర్మిస్తున్నామని తెలిపారు. సాంకేతిక సమస్యలపై కృష్ణా, గోదావరి బోర్డులకు స్పష్టంగా చెప్పామని రజత్‌కుమార్ పేర్కొన్నారు. కొత్తగా చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)లను సమర్పించాల్సిందేనని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కృష్ణా బోర్డు స్పష్టం చేసింది. బోర్డుతో పాటు కేంద్ర జల సంఘం, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు రావాలంటే డీపీఆర్‌లు అవసరమని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి నివేదిక ఇచ్చేందుకు.. కృష్ణాబోర్డు చైర్మన్ పరమేశం ఆధ్వర్యంలో హైదరాబాద్ జల సౌధలో గురువారం ఇరు రాష్ట్రాల అధికారులతో సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. గోదావరి నదిపై తెలంగాణ చేపట్టిన ప్రాజెక్టుల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిర్యాదు చేసిన నేపథ్యంలో హైదరాబాద్‌లోని జలసౌధలో గోదావరి నదీయాజమాన్య బోర్డు సమావేశం జరిగింది. ఇరు రాష్ట్రాల తరఫున అధికారులు, ఇంజినీర్లు తమ వాదనలు వినిపించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ తరఫున బోర్డులో వాదనలు వినిపించిన రాష్ట్ర నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రజత్ కుమార్ వివరాలను వెల్లడించారు. గోదావరి బేసిన్‌లో ఒక్క కొత్త ప్రాజెక్టు లేదని వెల్లడించామని, కాళేశ్వరం, తుమ్మిడిహట్టి ప్రాజెక్టులను కొత్త ప్రాజెక్టులుగా పరిగణించకూడదని కోరామని చెప్పారు. తెలంగాణకు రావాల్సిన వాటా ప్రకారమే ఎత్తిపోతల నిర్మాణం చేపట్టామని చెప్పారు. పోలవరం, పట్టిసీమపై బోర్డు దృష్టికి తీసుకుని వచ్చామని అన్నారు. పోలవరం నుంచి పట్టిసీమకు 80 టీఎంసీల నీటిని తరలిస్తున్నారని వెల్లడించారు. టెలిమెట్రీల విషయం ఎక్కడా దాచిపెట్టడం లేదని తెలిపారు. సాంకేతిక సమస్యలపై కృష్ణా, గోదావరి బోర్డులకు స్పష్టంగా చెప్పామన్నారు. గోదావరి బేసిన్‌లో తమకు 967 టీఎంసీల వాటా ఉందని చెప్పారు. గోదావరి బేసిన్‌లో టెలిమెట్రీ ఏర్పాటుపై కమిటీ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న అన్ని ప్రాజెక్టులకు అనుమతులు ఉన్నాయని చెప్పారు. 2014 జూన్ 2 వరకు పూర్తయిన ప్రాజెక్టుల గురించి అడగవద్దని కోరామన్నారు. గోదావరి నదిపై తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న కాళేశ్వరం, సీతారామ, తుపాకులగూడెం, లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టులతోపాటు రామప్ప నుంచి పాకాల వరకు నీటి తరలింపు విషయమై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరాలు వ్యక్తం చేసింది.

మంత్రి వేముల సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరికలు

కామారెడ్డి,జూన్5(ఆర్ఎన్ఎ):: టీఆర్ఎస్ లో చేరికల పర్వం పెద్ద ఎత్తున కొనసాగుతున్నది. తాజాగా కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని వర్ని మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్ లో చేరారు. బాన్సువాడ పట్టణంలోని టీఆర్ఎస్ నియోజకవర్గ కార్యాలయంలో వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకెళ్తుందన్నారు. టీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో వర్నిమండల కాంగ్రెస్ అధ్యక్షుడు, తగిలేపల్లి ఎంపీటీసీ బక్క నారాయణ, ముదిరాజ్ సంఘం మండలం అధ్యక్షుడు, జాకోరా ఎంపీటీసీ ఎండుగుల సాయిలు, 500 మంది కార్యకర్తలు టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు

చరిత్రలో నేటినిజం

కం॥ భీమాస్త్రాలు మెచ్చెడి గతి
సామాన్యులు నచ్చెడి గతి చతురని కథలన
కోమలముగ బిసి-పెలగె
రామా నాయుండు చిత్ర రంగము లోనన్!!

(జూన్ 6 రామానాయుడు జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

భర్త చితాభస్మాన్ని భార్యకు అప్పగించండి

మధుసూధన్ రావు కేసులో హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్,జూన్5(ఆర్ఎన్ఎ): నగరంలోని వనస్థలిపురానికి చెందిన అల్లంపల్లి మధుసూదన్ కరోనాతో వైరస్ మృతిచెందాడని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ హైకోర్టుకు తెలిపింది. అతని మరణ ధృవీకరణ పత్రం, చితాభస్మం తమ వద్ద ఉన్నాయని కోర్టుకు వివరించింది. కాగా తన భర్త మధుసూదన్‌కు కరోనా పాజిటివ్ అని నిర్ధారణ కావడంతో గాంధీ ఆస్పత్రిలో చేర్చిన తర్వాత అతని ఆచూకీ తెలియలేదంటూ భార్య మాధవి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై గురువారం విచారణ చేపట్టిన న్యాయస్థానం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఒకవేళ అతను కరోనాతో మృతిచెందితే కనీసం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వరా అని నిలదీసింది. ఈ మేరకు ప్రభుత్వం తరఫున వైద్య ఆరోగ్యశాఖ శుక్రవారం పూర్తి వివరాలను కోర్టుకు వివరించింది. కరోనా కారణంగానే మధుసూదన్ మృతి చెందాడని పేర్కొంది. ప్రభుత్వ వాదనతో ఏకీభవించిన న్యాయస్థానం అతని మరణ ధృవీకరణ పత్రంతో పాటు చితాభస్మం అతని భార్య మాధవికి అప్పగించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ వి.విజయ్‌సేన్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణనను ఈ నెల9 కి వాయిదా వేసింది.

వచ్చే ఐదేళ్లలో 200 అర్బన్ ఫారెస్టుల అభివృద్ధి

-కేంద్రమంత్రి జవదేకర్ వెల్లడి

న్యూఢిల్లీ,జూన్5(ఆర్ఎన్ఎ): దేశవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో 200 అర్బన్ ఫారెస్ట్‌లను అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రతీ ఏడాది జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్న సంగతి తెలిసిందే. కోవిడ్-19 సంక్షోభం కారణంగా వర్చువల్‌గా వేడుకలను జరిపింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్రం శుక్రవారం 'నగర్ వన్' పథకాన్ని ప్రకటించింది. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను కేంద్ర పర్యావరణశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్ జవదేకర్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో 200 అర్బన్ ఫారెస్టులను అభివృద్ధి చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, మున్సిపల్ విభాగం, ఎన్జీవోలు, కార్పొరేట్స్, స్థానిక పౌరులు, ప్రజల సహకారం, భాగస్వామ్యంతో ఈ నగర వనాలను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. యూనైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ఈ ఏడాది పలు కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. బయోడైవర్సిటీ ఈ ఏడాది థీమ్ కాగా.. కేంద్రం థీమ్ నగర్ వన్. పార్కులు నగరాల ఊపిరితిత్తులుగా పనిచేస్తాయని ప్రకాశ్ జవదేకర్ తెలిపారు. అటవీశాఖకు చెందిన భూముల్లోనే మొదటగా మొక్కల పెంపకం చేపడతామన్నారు. అనంతరం స్థానిక సంస్థలు అందించే భూముల్లో వనలా అభివృద్ధిని చేపడతామన్నారు. ప్రత్యేక ఏకాగ్రతతో జీవవైవిధ్యానికి ప్రకృతి కోసం సమయం కేటాయించాలన్నారు. ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందన్నారు. ప్రపంచ జీవవైవిధ్యంలో భారతదేశం 8 శాతాన్ని కలిగిఉందని మంత్రి తెలిపారు. ప్రపంచ భూభాగంలో 2.5 శాతం, జనాభాలో 16 శాతం, పశు సంతతి, 4 శాతం మాత్రమే మంచినీటి వనరులను కలిగి ఉండటం వంటి అనేక అవరోదాలు ఉన్నప్పటికీ జీవవైవిధ్యంలో భారత్ తన వంతు పాత్ర పోషిస్తుందన్నారు. జీవవైవిధ్యం భారతీయ సంస్కృతిలో భాగమని పేర్కొన్నారు.

గొప్పలతో కాలక్షేపం చేస్తున్న టీఆర్ఎస్

గంధమల్ల నిర్మాణం లేదంటున్న అధికారులు
ఎన్నికల్లో అబద్ధం చెప్పిన ఎమ్మెల్యే సునీత రాజీనామా చేయాలి: కోమటిరెడ్డి

యాదాద్రి భువనగిరి,జూన్5(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రం అన్నిట్లో ముందునీదని గొప్పలు చెప్పే సీఎం కేసీఆర్ ఓ సర్వేలో పదహారువ స్థానంలోకి ఎలా దిగజారారని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి విమర్శించారు. గందమల్ల రిజర్వాయర్ నిర్మాణంలేదని అధికారులే చెబుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో గందమల్ల రిజర్వాయర్ ఉందని ప్రజలను మోసం చేసిన ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనాటి కాంగ్రెస్ పార్టీ తెచ్చిన ప్రాజెక్టులకు కొద్దిపాటి నిధులు ఇస్తే పూర్తవుతాయన్నారు.. కానీ వాటిని పూర్తి చేయకుండా కేసీఆర్ గొప్పలు చెప్పుకోవడానికి ప్రజా సొమ్మును దుర్వినియోగం చేస్తూ.. కాంగ్రెస్ నాయకులపై నిందలు వేస్తున్నారని కోమటిరెడ్డి విమర్శించారు. కరోనా టెస్టుల విషయంలో హైకోర్టు మొట్టికాయలు వేసినా పరీక్షలు చేయటం లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు మేలు కంటే కీడు ఎక్కువగా చేస్తోందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు.

దేశంలో పెరుగుతూనే ఉన్న పాజిటివ్ కేసులు

కొత్తగా 9851 పాజిటివ్ కేసులు నమోదు
వైరస్ వల్ల 24 గంటల్లో 273 మంది మృతి

న్యూఢిల్లీ,జూన్5(ఆర్ఎన్ఎ): ఇండియాలో వరుసగా రెండవ రోజు కూడా కరోనా పాజిటివ్ కేసులు 9వేలు దాటాయి. గత 24 గంటల్లో దేశంలో 9851 పాజిటివ్ కేసులు నమోదు అయినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. వైరస్ వల్ల 24 గంటల్లో 273 మంది మరణించారు. దేశవ్యాప్తంగా మొత్తం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 2,26,770కి చేరుకున్నది. దీంట్లో మొత్తం 1,10,960 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. మరో లక్ష మందికిపైగా వైరస్ నుంచి కోలుకున్నారు. దేశంలో కరోనా వైరస్ వల్ల మరణించిన వారి సంఖ్య 6348కి చేరుకున్నట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఐసీఎంఆర్ కూడా తన టెస్టింగ్ సంఖ్యను రిలీజ్ చేసింది. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 43,86,376 మందికి కరోనా పరీక్షలు నిర్వహించినట్లు ఐసీఎంఆర్ తన రిపోర్ట్‌లో పేర్కొన్నది. అయితే గత 24 గంటల్లో 1,43,661 మందికి వైరస్ పరీక్షలు చేపట్టినట్లు ఐసీఎంఆర్ ఇవాళ వెల్లడించింది. ఇవాళ దేశంలో నమోదు అయిన పాజిటివ్ కేసుల సంఖ్య ఇదే అత్యధికంగా. భారత్‌లో వైరస్ రికవరీ రేటు 48.27 శాతంగా ఉన్నట్లు అధికారులు చెప్పారు. వైరస్ బారిన పడ్డ దేశాల్లో భారత్ ఏడవ స్థానంలో ఉన్నది. కోవిడ్19 వల్ల అమెరికా, బ్రెజిల్, రష్యా, బ్రిటన్, స్పెయిన్, ఇటలీ దేశాల్లో మరణాలు అత్యధిక స్థాయిలో ఉన్నాయి.

ఢిల్లీ మెట్రో సిబ్బందిలో 20 మందికి కరోనా

ఢిల్లీ మెట్రో రైల్ సిబ్బందిలో 20 మంది కరోనా మహమ్మారి బారినపడ్డారు. ఈ మేరకు ఢిల్లీ మెట్రో రైల్ కార్పోరేషన్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటన చేశారు. తమ సిబ్బందిలో ఇప్పటివరకు దాదాపు 20 మంది కరోనా వైరస్ బారిన పడ్డారని, అయితే వాళ్లలో ఏ ఒక్కరిలో కూడా వ్యాధి లక్షణాలు బయటకు కనిపించడం లేదని ఆ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అందరూ కోలుకుంటున్నారని ఆఓఖీఅ డైరెక్టర్ మంగూ సింగ్ చెప్పారు. కరోనాతో బాధపడుతున్న సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలని, సామాజిక దూరం పాటించాలని సింగ్ సూచించారు. కాగా, కరోనా వైరస్ విజృంభన నేపథ్యంలో మార్చి 22 నుంచి ఢిల్లీ మెట్రో రైల్ సేవలు నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వ అనుమతి లభించే వరకు ఢిల్లీ మెట్రో రైల్ సర్వీసులు ప్రారంభం కాబోవని ఇటీవల మెట్రో రైల్వే ప్రకటించింది. ఇదిలావుంటే ఢిల్లీలో మెట్రో రైల్ సర్వీసులకు అనుమతించాలని లాక్‌డౌన్ 4 సమయంలో ఢిల్లీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. అయితే ఢిల్లీ సర్కారు విజ్ఞప్తిని కేంద్రం తోసిపుచ్చింది.

కామారెడ్డి జిల్లా, తిర్మన్ పల్లి, గుర్లుల్ గ్రామాల్లో పల్లె ప్రగతి కార్యక్రమాలను ఆకస్మిక తనిఖీ చేసి హరితహారం కోసం అక్కడ ఏర్పాటు చేసిన నర్సరీలను పరిశీలించిన సిఎస్ సోమేశ్ కుమార్. చిత్రంలో పంచాయితీరాజ్ శాఖ కార్యదర్శి సందీప్ కుమార్ సల్తానియా, కమిషనర్ రఘునందన్ రావు ఉన్నారు.

పల్లెప్రగతితో గ్రామాల అసవరాలు తీరుస్తున్నాం

పారిశుద్య పనులతో చెత్తా చెదారం తొలగింపు
ఇదే స్ఫూర్తి కొనసాగించాలని సిఎస్ పిలుపు
పలు గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు చేసిన సిఎస్

కామారెడ్డి,జూన్5(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ప్రభుత్వం అమలు చేసిన పల్లె ప్రగతి, ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాల ద్వారా గ్రామాల అవసరాలు తీరి సుందర గ్రామాలుగా మారుతున్నాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ అన్నారు. అలాగే హరితహారంతో పచ్చదనం వెల్లివిరుస్తోందని అన్నారు. ఈ స్ఫూర్తి ఇలాగే కొనసాగించాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ కామారెడ్డి జిల్లాలో ఆకస్మికంగా పర్యటించారు. ప్రత్యేక హెలీకాప్టర్‌లో కామారెడ్డి చేరుకున్న ఆయన సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లిలో పల్లెప్రగతి పనులను పరిశీలించారు. తిర్మన్‌పల్లిలో మిషన్ భగీరథ నల్లాలను, పారిశుద్ధ్య పనులు, హరితహారం నర్సరీని పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకాన్ని ఏ విధంగా చేపడుతున్నారని వాకబు చేశారు. వానాకాలం పంటల సాగు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రైతువేదిక నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. మొదటగా తిర్మన్‌పల్లి గ్రామంలో మిషన్ భగీరథ నల్లాలను పరిశీలించారు. కనెక్షన్ పైప్‌లకు తప్పని సరిగా నల్లాలను ఏర్పాటు చేయాలని లేకపోతే జరిమానా విధించాలని అధికారులను ఆదేశించారు. రోజూ ఎంత సేపు మంచినీరు వస్తుందన్న విషయాన్ని సర్పంచ్ బాలరెడ్డి , గ్రామ పంచాయితీ సెక్రటరీ నరేష్‌ను అడిగి తెలుసుకున్నారు. రోడ్లను పరిశీలించారు. ఎలాంటి చెత్త, పిచ్చిమొక్కలు లేకుండా రోడ్లను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. గ్రామాలకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని సిఎస్ అన్నారు. గ్రామ పంచాయితీ ఆవరణలో ఉన్నసర్సరీని, రైతులు ఏ పంట వేయాలన్నది వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామ సభ జరిగిందా... లేదా? అని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో మొక్కజొన్న పంటకు బదులుగా పత్తి, కంది , సోయాబీన్ వేస్తున్నట్టు ఏఈవో తెలిపారు. క్రాస్‌బుకింగ్‌యాడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ సర్వే నెంబర్లు గల రైతులు వేసే పంటలను నీర్ణీత ఫార్మాట్‌లో నమోదుచేసుకోవలని సీఎస్ సూచించారు. కామారెడ్డి మండలం గర్లుల్ గ్రామాన్ని కూడా సీఎస్ సోమేశ్‌కుమార్ సందర్శించారు. తొలుత మంకీఫుడ్ కోర్టును పరిశీలించారు. గ్రామాలో 33 గ్రూపుల్లో 830 ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్నారని గ్రామ సర్పంచ్ రవితేజ సీఎస్ దృష్టికి తెచ్చారు. అనంతరం డంపింగ్‌యార్డు, కంపోస్ట్ షెడ్‌ను సీఎస్ పరిశీలించారు. కంపోస్ట్‌షెడ్‌లో బెడ్స్ ఇంకా పెంచాలని, కంపోస్ట్‌షెడ్‌లో పూర్తి శిక్షణనిచ్చిన వ్యక్తిని నియమించాలని సూచించారు. అనంతరం వైకుంఠధామాల పనులను పరిశీలించి అక్కడ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఎస్ వెంటనే పలువురు సీనియర్ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు.

ఉత్తరప్రదేశ్‌లో శుక్రవారం ఓ లారీని ఎస్‌యూవీ వాహనం ఢీకొన్న కారణంగా జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 9మంది దుర్మరణం చెందిన దృశ్యం

యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

లారీని ఢీకొన్న ఎస్‌వియూ
9మంది మృతి

లక్నో,జూన్5(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రతాప్‌గఢ్ జిల్లా పద్మ తెల్లవారుజామున ఓ లారీని ఎస్‌యూవీ వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన 9 మంది మరణించారు. వీరిలో ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారని, ఒకరు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. నవాబ్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వాజిద్‌పూర్ గ్రామం వద్ద ఉదయం 5.30 గంటలకు ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్పీ అభిషేక్ సింగ్ తెలిపారు. వాహనంలో చిక్కుకున్న మృతదేహాలను అతి కష్టంమీద బయటకు తీసినట్లు చెప్పారు. వీరంతా రాజస్థాన్ నుంచి బీహార్‌కు వెళున్నారని, అయితే మృతులు ఎవరన్నది ఇంకా గుర్తించలేదన్నారు. మరోవైపు సీఎం యోగి ఆదిత్యనాథ్ ఈ ప్రమాదం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయపడిన వారికి తగిన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు.

పర్యావరణ సంరక్షణ లో చిత్తశుద్ధి అవసరం..

నేటినిజం
శనివారం 6-6-2020

ఒకపక్క కరోనా మహమ్మారిని ఎదుర్కొనడం ఎలాగో తెలియక సామాన్యులు సతమతమవుతూ ఉపాధి లేక, తిండి దొరక్క కష్టాలు పడుతుండగా వచ్చిపడిన ఈ విపత్తులు తూర్పు, పడమర తీరాలను వణికించాయి. ఇందులో ఒకటి మే నెలలో బంగాళాఖాతంలో ఏర్పడిన అంపన్ తుపానైతే, రెండోది అరేబియా సముద్రంలో ఏర్పడి బుధవారం ముంబై సమీపంలో తీరం దాటిన నిసర్గ. అంపన్ 1999 తర్వాత బంగాళా ఖాతంలో ఏర్పడ్డ అతి పెద్ద తుపాను. ప్రత్యేకించి పశ్చిమబెంగాల్‌కు 200 ఏళ్లలో ఇంత భారీయెత్తున ఎప్పుడూ తుపాను రాలేదు. అది సృష్టించిన విలయం, విధ్వంసం అంతా ఇంతా కాదు. తుపాను విరుచుకుపడిన రాత్రి 72మంది చనిపోగా వేలాది వృక్షాలు నేలకొరిగాయి. భారీగా పంట నష్టం సంభవించింది. అంపన్ తుపాను వల్ల లక్ష కోట్ల మేర ఆస్తి నష్టం జరిగిందని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ప్రకటించింది. దేశంలోని నాలుగు మెట్రో నగరాల్లో ఒకటైన కోల్‌కతా చివురుటాకులా వణికింది. ఒడిశా కూడా పెను నష్టం చవిచూసింది. నిసర్గ సైతం అదే స్థాయిలో భయపెట్టింది. ముంబై మహానగరం వందేళ్లలో కనీవినీ ఎరుగనంతగా విధ్వంసాన్ని చవిచూడక తప్పదని వాతా వరణ నిపుణులు అంచనా వేశారు. అయితే ముంబై ముప్పును తప్పించుకుంది. 120 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీచడం, ఇళ్లు కూలడంవంటి ఉదంతాలు చోటు చేసుకున్నాయి. ఆరుగురు మరణించారు. పొరుగునున్న గుజరాత్‌లో కూడా ముప్పు తప్పించుకుంది.

వెంట వెంటనే వచ్చిన ఈ రెండు తుపానులకూ మూల కారణాలు పర్యావరణ విధ్వంసంలోనే వున్నాయి. ఉష్ణమండల ప్రాంతాల్లో ఏర్పడే తుపానులన్నీ సముద్ర జలాలు వేడెక్కడం వల్లే సంభవిస్తాయి. సముద్ర ఉపరితలం ఉష్ణోగ్రతలు 26.5 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు మించి పెరిగితే తుపానులు ఏర్పడతాయని నిపుణులంటారు. మొన్న మార్చిలో ఐక్యరాజ్యసమితికి అనుబంధంగా వుండే ప్రపంచ వాతావరణ సంస్థ విడుదల చేసిన నివేదిక చూస్తే పర్యావరణానికి ఏ స్థాయిలో ముప్పు ఏర్పడుతున్నదో అర్థమవుతుంది. భూతాపం కారణంగా వాతావరణంలో కలుగుతున్న మార్పులు మానవజీవనంపై పెను ప్రభావం చూపబోతున్నాయని ఆ నివేదిక హెచ్చరించింది. అధిక ఉష్ణోగ్రతల వల్ల ఆర్కిటిక్ సముద్రంలో మంచు పలకలు కరిగి సముద్ర మట్టాలు పెరుగుతున్నాయని, పర్యవసానంగా వాతావరణంలో పెనుమార్పులు చోటు చేసుకుని సాంఘికార్థిక అభివృద్ధి, ప్రజారోగ్యం, వలసలు పెను సమస్యలుగా మారతాయని, ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతుందని తెలిపింది. ప్రపంచ దేశాల వాతావరణ విభాగాలు, అంతర్జాతీయ నిపుణులు, వివిధ దేశాలకు చెందిన శాస్త్ర, సాంకేతిక పరిశోధన సంస్థలు వగైరాలతో సంప్రదించి ఏటా ఈ నివేదిక రూపొందిస్తారు. ప్రపంచంలో పర్యావరణ పరిస్థితి ఏవిధంగా వున్నదో అంచనా వేయడానికి హవాయీ దీవుల్లో కార్బన్ డై ఆక్సైడ్ స్థాయిని నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. ముఖ్యంగా వచ్చే నవంబర్‌లో స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరగబోయే వాతావరణ సదస్సులో తమ నివేదికను ప్రముఖంగా ప్రస్తావిస్తామని, వచ్చే పదేళ్లలో 2010నాటి స్థాయి కర్బన ఉద్గారాల్లో 45 శాతం కోత పడేందుకు అనువైన కార్యాచరణను సమష్టిగా రూపొందించుకోవాలని కోరుతామని చెబుతున్నారు. ఇంతవరకూ జరిగిన ప్రపంచ వాతావరణ సదస్సుల వాలకం చూస్తే గ్లాస్గో సదస్సు ఫలితంపై ఎవరికీ పెద్దగా ఆశలు ఏర్పడవు. ఒక పక్క పర్యావరణానికి ముప్పు ముంచుకొస్తున్నదని చెప్పినా ఏ దేశమూ చిత్తశుద్ధితో నివారణ చర్యలపై దృష్టి పెట్టడం లేదు. పర్యవసానంగానే అంపన్, నిసర్గ వంటి తుపానులు విరుచుకుపడుతున్నాయి. నిసర్గ తుపాను వాస్తవానికి వాతావరణ శాస్త్రవేత్తలను పరుగులెత్తించింది. అల్పపీడనంగా వున్న దశలోనే తుపాను హెచ్చరిక జారీ చేయడం మన వాతావరణ విభాగం చరిత్రలో తొలిసారి నిసర్గ విషయంలోనే జరిగిందని అధికారి చెప్పారంటే అది మొదటినుంచి ఎంత దుందుడుకుగా వున్నదో ఊహించవచ్చు. ఈ పర్యావరణ దినోత్సవ సందర్భంగా ప్రపంచ దేశాలు ఆలోచిస్తే అంతకంటే ఏం భాగ్యం..?

వేములవాడలోనూ దర్శనాలకు ఏర్పాట్లు

ధర్మగుండం స్నానాలకు అనుమతి లేదు
కోడె మొక్కులకూ ఇప్పట్లో దూరమే
కేవలం లఘుదర్శనానికి మాత్రమే అవకాశం

వేములవాడ,జూన్5(నేటినిజం ప్రతినిధి):లాక్‌డౌన్ సడలింపులతో పాటు, ఆలయాల దర్శనాలకు అనుమతులు రావడంతో వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రంలో 8వ తేదీ నుంచి భక్తులను దర్శనానికి అనుమతిం చేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశారు. సోమవారం నుంచి గంటకు 200 మంది భక్తులకు స్వామివారి లఘుదర్శనం అవకాశం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. కరోనా వైరస్‌ని యంత్రణలో భాగంగా మార్చి 19 నుంచి రాజన్న ఆలయంలో భక్తులకు దర్శనాలను నిలిపివేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం లాక్‌డౌన్ నిబంధనలను సడలించి జూన్ 8 నుంచి ప్రార్థనా మందిరాలలో భక్తులకు అనుమతించవచ్చని స్పష్టం చేయడంతో భక్తులు ఆలయంలోని కోడెమొక్కులు, దర్శనం క్యూలైన్లలో భౌతికదూరం పాటించే విధంగా దూరం దూరంగా డబ్బాలను గీశారు. భక్తులను దర్శనానికి అనుమతించే పక్షంలో కేవలం లఘుదర్శనంకు మాత్రమే అవకాశం ఉంటుందని, ఆర్జిత సేవలకు ఇప్పట్లో అవకాశం ఉండబోదని తెలుస్తోంది. రాజన్న ఆలయంలో ప్రత్యేకమైన కోడెమొక్కు సమర్పణ, తలనీలాల సమర్పణతో పాటు ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు అనుమతి ఇచ్చే అవకాశం కనిపించడం లేదు. ఆలయ పరిసరాలను శానిటేషన్ చేయడంతో పాటు థర్మల్ స్క్రీనింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. ఆలయంలో భక్తులను అనుమతించే అంశంపై ఇంకా తమకు ఆదేశాలు రాలేదని ఆలయ ఏఈవో డి.ఉమారాణి తెలిపారు. అనుమతి లభించిన వెంటనే భక్తులకు దర్శనం కల్పించేందుకు తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. లాక్ డౌన్ లో సడలింపులు చేసిన కేంద్రం ఈనెల 8నుండి ఆలయాలు కూడా తెరవచ్చని తెలిపింది. ఇప్పటికే తిరుపతి, యాదాద్రి ఆలయాలను తెరుస్తునట్టు ఆ ఆలయ కమిటీలు ప్రకటించగా తాజాగా వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రం తెరవనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ నెల 8వ తేదీ నుంచి భక్తులను దర్శనానికి అనుమతించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు ఆలయంలోని కోడెమొక్కులు, దర్శనం క్యూలైన్లలో భౌతికదూరం పాటించే విధంగా దూరం దూరంగా డబ్బాలను గీశారు. అయితే ప్రస్తుతం లఘుదర్శనం మాత్రమే ఉంటుందని కోడెమొక్కులు, ఆర్జిత సేవలకు అనుమతి లేదని తెలిపింది. అంతే కాకుండా కోనేటి స్నానం కూడా ఉండదని స్పష్టం చేసింది. ఇక భక్తులను ఆలయంలోకి అనుమతించేముందు థర్మల్ స్క్రీనింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

వికారాబాద్,జూన్5(ఆర్ఎన్ఎ): దోమ మండలం పాలేపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. జగదీష్ (25)అనే యువకుడు గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసి కుటుంబ సభ్యులు బోరున విలపించారు. గ్రామస్తులు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చి కన్నీటి పర్యంతమయ్యారు. జగదీష్ హైదరాబాద్‌లో నివాసం ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇటీవల లాక్‌డౌన్‌కు ముందు సొంతూరు వచ్చి పొలం పనులు చేసుకుంటున్నాడు. ఇంతలో ఏమైందో ఏమోగానీ ఈరోజు ఉదయం గ్రామ శివారులో చెట్టుకు ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలపై అన్వేషిస్తున్నారు.

భారత దౌత్యవేత్తకు ఐఎస్ఐ వేధింపులు

లాహోర్,జూన్5(ఆర్ఎన్ఎ): భారత సీనియర్ దౌత్యవేత్తను పాకిస్తాన్ ఐఎస్ఐకు చెందిన ఓ వ్యక్తి వేధించాడు. ఐఎస్ఐ వ్యక్తి, భారత దౌత్యవేత్త గౌరవ్ అహ్లువాలియా నివాసం వెలుపల వేచి ఉండి బయటకు రాగానే అతడి కారును వెంబడిస్తూ.. బెదిరించే ప్రయత్నం చేశాడు. పాకిస్తాన్ ఐఎస్ఐ, గౌరవ్ ఇంటి బయట కార్లు, బైక్‌ల మీద మనుషులను ఉంచి అతడిని వేధింపులకు గురి చేయడమే కాక భయపెట్టేందుకు ప్రయత్నించింది. న్యూఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు ఐఎస్ఐ అధికారులను భారత్ బహిష్కరించిన కొద్ది రోజులకే ఈ సంఘటన జరగడం గమనార్హం. కొద్ది రోజుల క్రితం పాకిస్తాన్ ఐఎస్ఐ అధికారులు అబిద్ హుస్సేన్, ముహమ్మద్ తాహిర్లు న్యూ ఢిల్లీలోని భారత సైన్యానికి సంబంధించిన పత్రాలను పొందడానికి ప్రయత్నిస్తున్నప్పుడు భారత గూఢచార సంస్థలు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం వారిని దేశం నుంచి బహిష్కరించారు.

వైద్య సిబ్బందికి సెలవులు రద్దు

రెండు బ్యాచ్‌లుగా విభజించి క్వారంటైన్

హైదరాబాద్,జూన్5(ఆర్ఎన్ఎ): వైద్య సిబ్బందికి సెలవులు రద్దు చేస్తూ తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. రెండు బ్యాచ్‌లుగా విభజించి ఒక్కో బ్యాచ్‌ను వారంపాటు క్వారంటైన్‌లో ఉంచాలని, డ్యూటీలో ఉన్న ప్రతి ఒక్కరూ పీపీఈ కిట్లు ధరించాలని ఆదేశించింది. జీహెచ్ఎంసీ పరిధిలో టీచింగ్ కాలేజీలతో పాటు ఆస్పత్రి సూపరింటెండెంట్లకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆదేశాలు జారీ చేసింది.

కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో నివారించేందుకు జీహెచ్ఎంసి పరిధిలోని టీచింగ్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రి సూపరింటెండెంట్‌లకు మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ రమేష్ రెడ్డి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఆస్పత్రిలోని వైద్యులతో పాటు ఇతర సిబ్బందిని రెండుగా విభజించాలని సూచించింది. ప్రతి బ్యాచ్‌కు 7రోజులు క్వారంటైన్లో ఉంచాలి. ఒక బ్యాచ్ ముగిసిన వెంటనే మరో బ్యాచ్‌ను క్వారంటైన్ చేయాలి. 3)కరోనా విజృంభణ నేపథ్యంలో సెలవులు రద్దు చేయాలి.4)డ్యూటీలో ఉన్న వైద్యులకు, వైద్య సిబ్బందికి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఐసోలేషన్, కరోనా టెస్టులు చేసి ట్రీట్‌మెంట్ అందించాలి. ప్రతి ఆసుపత్రిలో డ్యూటీలో ఉన్న వాళ్లందరు విధిగా వ్యక్తిగత రక్షణ కోసం పీపీఈ కిట్, మాస్కు ధరించాలి.

భద్రాద్రి పరిసరాల్లో మిడతల దండు

భద్రాద్రి కొత్తగూడెం,జూన్5(ఆర్ఎన్ఎ): అశ్వాపురం మండల పరిధిలోని బీజీకొత్తూరు గ్రామంలో బుధవారం జిల్లేడు చెట్లపై మిడతలు కనిపించాయి. మిడతలు పెద్ద సంఖ్యలో జిల్లేడు చెట్లపై చేరి వాటి ఆకులు తిని చెట్లకు ఆకులు లేకుండా మోడుగా మార్చాయి. ఇటీవలి కాలంలో మిడతల వల్ల కలిగే నష్టాలపై అధికారులు అప్రమత్తం చేయడం, పక్క రాష్ట్రాల నుంచి ఏ క్షణంలోనైనా మిడతలు జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్న తరుణంలోనే మిడతలు కనిపించడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మిడతలు చెట్ల ఆకులు తిని మోడుగా మార్చడం గమనించిన వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించారు. మండల వ్యవసాయ అధికారి డి.సాయిశంతన్‌కుమార్ బీజీకొత్తూరు గ్రామాన్ని సందర్శించి జిల్లేడు చెట్లపై ఉన్న మిడతలను పరిశీలించారు. ఈ మిడతలు పంటలు నాశనం చేసేవి కావని, జిల్లేడు చెట్ల మీద మాత్రమే పెరుగుతాయని, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ అధికారి తెలిపారు.

కరోనా వలయంలో ప్రజలు

హైదరాబాద్, జూన్ 5:లాక్‌డౌన్ సంకెళ్లు దాదాపు తెగిపోయినట్లే. అన్ని వ్యవస్థలు మళ్లీ గాడిన పడుతున్నాయి. కుదేలయిన భారత్ ఆర్థికరంగం మళ్లీ గాడిన పడాలని ప్రభుత్వాలు కూడా చూస్తున్నాయి. అందుకే మెల్లగా గేట్లు బార్లా తెరిచారు. ప్రజలు కూడా పనిచేసుకుంటే తప్ప పూటగడవని వారు ఎందరో ఉన్నారు. అందుకే లాక్‌డౌన్‌తో ఇళ్లకే పరిమితం కావాలని కోరుకోకోవడం లేదు. దీనికితోడు కరోనా భయం ఉన్నా.. ఆకలి భయం చంపేస్తోంది. అందుకే ప్రజలు తమ విధుల్లో చేరేందుకు ఉత్సాహంగా పరుగెడుతున్నారు. దీంతో రోడ్లన్నీ మళ్లీ బిజీగా ఉన్నాయి. కాళుష్యం మళ్లీ కళ్లకు కనిపిస్తోంది. ఈ దశలో ఇక మిగిలిన కొన్ని రంగాలకు కూడా సడలింపులు ఇచ్చేశారు. ఈ నెల 8నుంచి నుంచి రెస్టారెంట్, హోటల్స్‌తో పాటుగా దేవాలయాలు కూడా తెరుచుకోబోతున్నాయి. ప్రజలు కూడా ఎప్పుడెప్పుడా అని వీటి కోసం ఎదురు చూస్తున్నారు. దేవాలయా ల్లోకి వెళ్లే భక్తులు కొన్ని నియమాలను తప్పకుండా పాటించాల్సి ఉంటుంది. ఆలయంలో కనీసం ఆరు అడుగుల దూరం ఉండాలి. ముఖానికి మాస్క్ తప్పనిసరిగా ధరించాలి. అంతేకాదు, ఆలయంలోని విగ్రహాలను, ఇతర వస్తువులను ముట్టుకోవడానికి వీలులేదు. ఆలయాల్లో సామూహిక భజన కార్యక్రమాలకు అనుమతి లేదు. ఆలయం లోపల తీర్థ ప్రసాదాలకు కూడా అనుమతి లేదు. కొంతకాలం పాటు తప్పనిసరిగా నియమనిబంధనలు తప్పకుండా ప్రతి ఒక్కరు పాటించాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఇప్పుడిక మనమంతా కరోనా వలయంలో చిక్కుకున్నాం. ఆ వలయం నుంచి బయటపడేలా జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. భారత్‌లో కరోనా కేసులు భారీగా పెరుగుతున్న వేళ రోజుకు తొమ్మిదివేలకు పైగా కేసులు నమోదవుతుండటంతో ప్రభుత్వాలు అప్రమత్తం అయ్యి కొన్ని కఠిన నిబంధనలు విధిస్తున్నాయి. మొత్తంగా మళ్లీ అన్ని షరా మామూలు అవుతున్న వేళ మనమంతా మరింత అప్రమత్తంగా ఉండకపోతేత కరోనాను కౌలిగించు కోవద్దు. సడలింపులు ఇచ్చారని, లాక్‌డౌన్ సంకెళ్లు తెంచుకున్నామని రంకెలు వేస్తే కరోనాతో కష్టాలు తప్పవు. బయట ప్రపంచంలో కరోనా వ్యాప్తి తీవ్రంగా ఉంది. ఎవరితో అది సహవాసం చేస్తున్నదో తెలియదు. కరోనా వైరస్ మహమ్మారిపై మన దేశం ఎడతెగకుండా పోరు సాగిస్తున్నా ఆ కేసుల సంఖ్య 2లక్షల పదివేలకు చేరువయ్యింది. ఇది మరింతగా పెరుగు తందని అంచనాలు వస్తున్నాయి. వైరస్ దండయాత్ర మొదలెట్టినప్పుడువున్న స్థాయిలో ఇప్పుడు భయాందోళనలు కనిపించడం లేదు. ప్రజలు విచ్చలవిడిగా తిరుగుతున్నందున ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. ఎదుటివారితో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాల్సిందే. ఎదుటి వారికి కరోనా ఉందన్న భయంతో మసలుకోవాలి. ఎవరైనా తుమ్మినా, దగ్గినా, జ్వరం వుందని చెప్పినా వారిని చూసి హడలెత్తే వారు ఇప్పటికీ ఎక్కువే. కరోనా బాధితులనూ, వ్యాధిగ్రస్తుల కుటుంబాలనూ దూరంపెట్టేవారి సంఖ్య కూడా తక్కువేమీ కాదు. కానీ దాని బారినపడితే మరణం ఖాయమన్న అపోహ పోయింది. మరణాల సంఖ్య విపరీతంగా ఉండివుంటే ప్రజలు నిజంగానే భయపడే వారు. కానీ అలాజరగడం లేదు. మరణాల సంఖ్య తక్కువగా ఉండడంతో ఎవరికివారు ధీమాగా ఉన్నారు. అలాగే వ్యాధి గురించి వెల్లడిస్తే దోషిగా పరిగణిస్తారన్న భయం కూడా తగ్గింది. వ్యాధి గురించి భయపడ తగిన జాగ్రత్తలు తీసుకుంటే అది దరిచేరదని అవగాహన ఏర్పడింది. ప్రస్తుతానికి మనం కరోనా జాబితాలో ప్రపంచంలో ఏడో స్థానంలో వున్నాం. వ్యాధిగ్రస్తుల సంఖ్య, మరణాల సంఖ్య ఎక్కువున్నట్టే అనిపిస్తున్నా ఆందోళన పడాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ చెబుతోంది.కరోనా కేసుల సంఖ్య లక్షగా నమోదైన పక్షం రోజుల్లోనే అది రెట్టింపు కావడం గమనించదగ్గది. తొలి 50వేలకేసులకూ 66 రోజులు పడితే... ఆ సంఖ్య డబుల్ కావడానికి కేవలం 12 రోజులు పట్టగా, మరో 50వేలకు చేరడానికి 8 రోజులు మాత్రమే పట్టింది. ఇక చివరి 50వేల కేసులకూ కేవలం ఏడు రోజుల వ్యవధి మాత్రమే పట్టింది. అంటే వైరస్ ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవాలి. అందుకే ప్రజలు ఈ గణాంకాలను మననం చేసుకుంటూ మసలుకోకపోతే మనకూ అది ఎంతో దూరం లేదని గ్రహించాలి. ప్రభుత్వాలు ఈ విషయంలో ప్రజల్ని మరింత అప్రమత్తం చేయక తప్పదు. కరోనా విషయంలో కచ్చితంగా తీసుకునే జాగ్రత్తలే ప్రాణహాని నుంచి కాపాడతాయని ప్రజలు గుర్తించి ముందుకు సాగితే తప్ప ప్రమాదం నుంచి తప్పుకోలం. మాల్స్, గుళ్లూ తెరుచుకుంటున్నాయి కనుక పొలోమని పరుగెత్తకుండా జాగ్రత్తలు పాటించాలి. ప్రభుత్వాలిచ్చిన వెసులు బాట్లు ఆసరా చేసుకుని దైనందిన కార్యకలాపాలు మళ్లీ గతంలో లాగానే స్పీడ్ అందుకున్నాయి. వ్యాపార, వాణిజ్య, ఉత్పాదక కార్యకలాపాలు మెల్లగా ఊపందుకుంటున్నాయి. అయితే చాలా చోట్ల భౌతిక దూరం పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రైల్వే స్టేషన్లలో, బస్టాండ్లలో భౌతిక దూరం పాటించడం లేదు. కరోనాకు దూరంగా ఉండడంతో పాటు పర్యావరణానికి హాని చేకూర్చే విధానాలకు స్వస్తి చెప్పడం, ఆరోగ్యాన్ని దెబ్బతీసే అలవాట్లు మానుకోవడం, రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవడానికి ప్రాధాన్య మీయడం ప్రస్తుత అవసరం అన్నది గుర్తించ మసులకోవాల్సి ఉంది. ఈ విషయంలో ఏమరపాటు ప్రదర్శిస్తే ముప్పు ఏర్పడుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ పదేపదే హెచ్చరిస్తున్న సంగతిని మరువరాదు. మనకు పరీక్షలు నిర్వహించే కిట్లు ఇంకా అందుబాటులోకి రాలేదు. పరీక్షలు జరపడం,వ్యాధిగ్రస్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడంలో ఇంకా మెరుగు పడలేదు. ఇది గుర్తెరిగి లాక్‌డౌన్ నిబంధనలు ఉన్నాయను కుని వ్యక్తిగత జాగ్రత్తలతో ముందుకు సాగాలి. లేకుంటే కరోనా మరణాల సంఖ్య పెరిగే జాబితా కూడా కాలంతో పాటు పెరుగుతుందనడంలో సందేహం వద్దు.

ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టే యత్నాల్లో మోడీ?

నిర్మలను మారుస్తారన్న ప్రచారంలో నిజం ఎంత?
లాక్‌డౌన్ కష్టాల నుంచి గట్టెక్కే యత్నాల్లో కానరాని చిత్తశుద్ధి

న్యూఢిల్లీ,జూన్5(ఆర్ఎన్ఎ): దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు ఆ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్థానంలో కామత్‌ను తీసుకుని వస్తారన్న ప్రచారం సాగుతోంది. అయితే ఇది ఎంతవరకు నిజమో కానీ పుకార్లు మాత్రం షికారు చేస్తున్నారు. బ్రిక్స్ బ్యాంక్ ఛైర్మన్‌గా ఉన్న కెవి కామత్‌ను కేంద్ర ఆర్థికమంత్రిని చేస్తారన్న ప్రచారం సాగుతోంది. లాక్‌డౌన్‌తో పాటు అంతకు ముందే భారత్ ఆర్థికరంగం దెబ్బతింటూ వస్తోంది. కరోనాతో వృద్ధిరేటు కుదేలయ్యింది. దీంతో భారత్ మళ్లీ ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే సమర్థ నాయకత్వం అవసరం అని ప్రధాని భావిస్తున్నారని సమాచారం. మోడీ రెండవసారి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయ్యింది. ఏడాదిగా నిర్మలా సీతారామన్ ఆర్థికమంత్రిగా కొనసుగుతున్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చన వెంటనే ప్రధాని మోడీ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మొదటి వంద రోజుల్లోనే కశ్మీర్ స్వయంప్రతిపత్తి రద్దు, త్రివుల్ తలాఖ్ నిషేధం, పౌరసత్వ చట్టం వంటివి దూకుడుగా ప్రవేశపెట్టిన అమిత్ షా మోదీకి ప్రత్యామ్నాయ నాయకుడుని అంతా భావించారు. ఓ దశలో తదుపరి రాష్ట్రపతిగా మోడీ వెళితే ప్రధానిగా అమిత్ షా ఉంటారన్న ప్రచారం సాగింది. అయితే భావిస్తే అది పొరపాటేనని తాజా పరిణామాలు గుర్తు చేస్తున్నాయి. మొదటి అయిదేళ్లూ పార్టీ అధ్యక్షుడుగా, ఆ తర్వాత హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అమిత్ షా తనకు కుడిభుజంగానో తన ఎజెండాను అమలు చేయగలిగిన పరికరంగానో మోదీ భావించినట్లు ఇటీవల పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.అమిత్ షా పార్టీ అధ్యక్షుడుగా గద్దె దిగినప్పటి నుంచీ జరుగుతున్న పరిణామాలు చూస్తే మోడీ ఒక్కడే న ఆయకుడు అన్న రీతిలో నిర్ణయాలు సాగుతున్నాయి. తన ఎజెండాను అమలుచేసే విషయంలో మోదీకి అమిత్ షా ఎంత ముఖ్యమో, నిర్మలా సీతారామన్ అంతే ముఖ్యమని, ఇరువురినీ ప్రధానమంత్రి కార్యాలయమే నిర్దేశిస్తురదని అర్థమవుతోంది. మోదీ హయాంలో మంత్రులంతా నామమాత్రమేనని అర్థం అవుతోంది. రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదం కావడం..వ్యాపార సంస్థలు, బ్యాంకులు దివాళా తీస్తూ ఆర్థిక సంక్షోభం తీవ్రతరమవుతున్న వేళ కరోనా విపత్తు దేశాన్ని తాకింది. దీంతో ఆర్థికరంగం మరింతగా దిగజారింది. అంతేనా అంటే తీసుకున్న చర్యలు దేశంలోని ఏ ఒక్కరినీ సంతృప్తి పరచలేదు. దేశమంతటా ఏకం చేయగలిగిన భారాన్ని భుజాని కెత్తుకున్న నేతగా కనిపించిన మోదీకి కరోనా సంక్షోభం కలసి వచ్చిందనే చెప్పాలి. ఆర్థిక సంక్షోభం గురించి ప్రజలు మరచి పోవడమే గాకుండా మోడీని సమర్థ నేతగా ఊహించుకుంటున్నారు. రూ.20లక్షల కోట్ల ప్యాకేజీ వల్ల ఒరిగిందేమీ లేదని..జీవనోపాధి కోల్పోయిన లక్షలాది మంది తిట్టుకుంటున్నారు. ఇఎంఐలు వాయిదా వేసినా వడ్డీ భారం తడిసి మోపెడు అవుతున్నా సర్కార్‌లో చలనం రావడం లేదు. కనీసం ఇలాంటి వెసలుబాట్లు కూడా ఇచ్చి ప్రజలను కాపాడుకోవాలన్న ఆలోచన చేయడం లేదు. వలసకార్మికుల జీవితాలు మారతాయని, జీతాలు, ఉద్యోగాల కోతతో క్రుంగిపోయిన మధ్యతరగతి మానసిక వ్యధలు తొలగిపోతాయని, ఆర్థిక వ్యవస్థ భారీ ఎత్తున ఊపందు కుంటుందని 20లక్షల కోట్ల ప్యాకేజీ ప్రకటించ గానే అంతా భ్రమిసారు. వినడానికి గరీబ్ కళ్యాణ్ యోజన పేరు బాగున్నా గరీబోళ్ల బతుకులు మారలేదని అర్థం అవుతోంది. ఈ దశలో ఆర్థికమంత్రిని మారిస్తే పరిస్థితులు మారుతాయా అన్నది చూడాలి. పాలనా విధానాల్లో మార్పులు లేకుండా మంత్రులను మారిస్తే ఆర్థిక వ్యవస్థ గాడిన పడుతుందా అన్నది కూడా అనుమానమే. అయితే ఇంతకూ కెవి కామత్‌ను తీసుకుని వస్తారా లేదా అన్నది కూడా ఊహాజనిత వార్త మాత్రమే. రెండవసారి అధికారంలోకి వచ్చాక ఏడాది కాలాన్ని పూర్తి చేసుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇంతవరకూ పేదలు, సామాన్యులకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలేవీ ఫలితం ఇవ్వలేదు. గోదాముల్లో ఆహార ధాన్యాలు కుళ్లిపోతుంటే వాటిని ఆకలితో అలమటిస్తున్న పేదలకు పంచడం లేదు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చి ఆరేళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ కాలంలో జరిగిన బృహత్తరమైన మార్పులు ఉన్నాయి. వాటిని కాదనలేం. 370 రద్దు, కాశ్మీర్ స్వయంప్రతిపత్తిని కాదని లద్దాఖ్ విభజన, ట్రిపుల్ తలాక్, అయోధ్య వివాద పరిస్కారం వంటివి చారిత్రాత్మక నిర్ణయాలే. ఈ ఆరేళ్లలో మోదీ ప్రభుత్వం సాధించిన విజయంగా అభివర్ణించవచ్చు. అయితే ఇవేవీ పేదల కాలే కడుపుల ఆకలిని తీర్చలేవు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏ పనిచేసినా దానికొక నిర్దిష్ట లక్ష్యం ఉంటుంది. ఆ లక్ష్య సాధనకు అనుగుణంగా వ్యవస్థల్నీ, చట్టాల్నీ మార్చుకోవడం, అవి మారడానికి తగిన చర్యలు చేపట్టడం పద్ధతి ప్రకారం జరుగుతుంటుంది. స్వచ్ఛ భారత్, సబ్ కాసాథ్- సబ్ కా విశ్వాస్, మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, స్మార్ట్ సిటీస్, బేటీ పడావో-బేటీ బచావో వంటి రకరకాల పేర్లను ఖాయం చేసి మార్కెట్‌లో వదిలినా మార్పు రాలేదు. కోట్లాది మందిని విశ్వాసంలోకి తీసుకుని, అభివృద్ధిలో వారిని భగస్వాములను చేయలేదని అర్థమవుతోంది.

సిద్దూ పార్టీని వీడితే కాంగ్రెస్ బలహీనపడుతుందా?

ఆశగా ఎదురుచూస్తున్న కమలనాథులు

న్యూఢిల్లీ,జూన్5(ఆర్ఎన్ఎ): పంజాబ్‌లో రాజకీయ పరిణామాలను కేంద్ర బిజెపి సీరియస్‌గా గమనిస్తోంది.

మాజీ మంత్రి నవజోగ్ సింగ్ సిద్దూ కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పేందుకు రంగం సిద్ధమైందన్న వార్తలు బిజెపికి ఆనందం కలిగించేవిగా ఉన్నాయి. ఆయన ఇప్పటికే కాంగ్రెస్‌కు దూరమైనట్లే కనిపిస్తుంది. దీంతో అక్కడ కాంగ్రెస్ బలహీనపడగలదని బిజెపినేతలు భావిస్తున్నారు. కొంత కాలంగా ఆయన పార్టీని వీడతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. దీనికోసం ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌తో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఊహాగాహాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ ఛీఫ్ అరవింద్ కేజ్రీవాల్ ..సిద్దూ రావాలనుకుంటే మా పార్టీ ఆయనకు స్వాగతం పలుకుతుందన్నారు. 2017 ఎన్నికల సమయానికి బీజేపీ నుంచి కాంగ్రెస్

పీర్జాదిగూడను అద్భుతంగా తీర్చిదిద్దుతాం: మంత్రి

మేడ్చల్ మల్కాజిగిరి,జూన్5(ఆర్ఎన్ఎ): పీర్జాదిగూడ నగర పాలక సంస్థను నెంబర్‌వన్‌గా తీర్చి దిద్దుతామని కార్మిక శాఖా మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం పిర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఆయన జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డిలతో కలిసి శంకుస్థాపన చేశారు. నగర పాలక పరిధిలో దాదాపు రూ. 5 కోట్ల వ్యయంతో బోడుప్పల్‌లో బీటీ రోడ్లు, బుద్ధనగర్‌లో వర్షపు నీటి కాలువ నిర్మాణం పనులు, బుద్ధనగర్ విష్ణుపురి కాలనీలలో పార్కు స్థలానికి ప్రహరీ గోడ, కేఎల్ఎం ప్రధాన రోడ్డులో బీటీ రోడ్డు, మేడిపల్లి నుంచి పర్వతాపూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణపు పనులను ప్రారంభించారు. అనంతరం పీర్జాదిగూడ నగర పాలక సంస్థ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు సమక్షంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లు అధివృద్ధి చెందుతున్నాయన్నారు.

భారత్‌కు 200 మిలియన్ యూరోల సాయం

న్యూఢిల్లీ,జూన్5(ఆర్ఎన్ఎ): భారత్‌కు 200 మిలియన్ యూరోల మేర రాయితీలతో కూడిన రుణాన్ని మంజూరు చేసేందుకు ఫ్రాన్స్ ముందుకు వచ్చింది. కోవిడ్-19, భయంకర ఉంపన్ తుపాను కారణంగా నష్టపోయిన బలహీన వర్గాలను ఆదుకునేందుకు ఈ మేరకు సాయం అందిస్తున్నట్లు ఫ్రాన్స్ దౌత్యవర్గాలు వెల్లడించాయి. కాగా ఉంపన్ తుపాను భారత్‌లో విధ్వంసం సృష్టించిన నేపథ్యంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయల్ మాక్రాన్ భారత ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు.

టీఆర్ఎస్ లో చేరిన కాంగ్రెస్ నేతలు

కామారెడ్డి,జూన్ 5 : టీఆర్ఎస్ లో చేరికల పర్వం పెద్ద ఎత్తున కొనసాగుతున్నది. తాజాగా కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గ పరిధిలోని నిజామాబాద్ జిల్లా వర్ని మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్ లో చేరారు. బాన్సువాడ పట్టణంలోని టీఆర్ఎస్ నియోజకవర్గ కార్యాలయంలో వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకెళ్తుందన్నారు. టీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని పార్టీలో చేరినట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో వర్నిమండల కాంగ్రెస్ అధ్యక్షుడు, తగిలేపల్లి ఎంపీటీసీ బక్క నారాయణ, ముదిరాజ్ సంఘం మండలం అధ్యక్షుడు, జాకోరా ఎంపీటీసీ ఎండుగుల సాయిలు, 500 మంది కార్యకర్తలు టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

ఇళ్ల స్థలాల సేకరణలో లోపించిన పారదర్శకత: బిజెపి

అమరావతి,జూన్5(ఆర్ఎన్ఎ): స్థానిక ఎన్నికల్లో లబ్దిపొందాలనే ఉద్దేశంతోనే ఇళ్ల స్థలాల పేరుతో... వైసీపీ ఆదరాబాదరాగా ముందుకెళ్లిందని బీజేపీ నేత తిరుపతిరావు విమర్శించారు. ఇళ్ల స్థలాలకు భూమి సేకరణలో పారదర్శకత లేదన్నారు. పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో దళితుల భూములు తీసుకుంటున్నారని మండిపడ్డారు. పేదల భూములకు తక్కువ రేటు ఇస్తున్నారని... వైసీపీ నేతల భూములకు ఎక్కువ రేటు చెల్లిస్తున్నారని వ్యాఖ్యానించారు. వైకాపా నేత చేతివాటం కూడా ఉందన్నారు. ఇసుక విధానంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. ఆన్‌లైన్‌లో ఇసుక దొరకదని, ఆఫ్‌లైన్‌లో ధర ఎక్కువ చేస్తున్నారని దుయ్యబట్టారు. విశాఖలో ఇసుక స్మగ్లింగ్ జరుగుతోందని..ప్రభుత్వానికి తెలిసే ఇసుక దందా జరుగుతోందన్నారు. సాండ్ స్మగ్లింగ్‌లో పెద్ద పెద్ద రాజకీయ నేతలున్నారన్నారు. పెద్దల అండ వల్లే ఇసుక లారీలను పోలీసులు ఆపరని తిరుపతిరావు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మహిళల మృతి

మృతులంతా బైక్ వెనకాల కూర్చున్న వారే

హైదరాబాద్,జూన్5(ఆర్ఎన్ఎ): వివిధ రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మహిళలు మృతి చెందారు. మృతిచెందినవారంతా వెనకాల కూర్చుని ప్రయాణిస్తున్న వారే కావడం విశేషం. పేట్‌బషీరాబాద్, మేడ్చల్, బాచుపల్లి ప్రాంతాల్లో జరిగిన నాలుగు ప్రమాదాల్లో రెండు సంఘటనల్లో వెనక నుంచి వచ్చిన వాహనాలు ఢీకొనడంతో బైక్‌పై కూర్చున్న వారు అదుపు తప్పి కిందపడిపోయి తలకు తీవ్రగాయాలయ్యి మరణించారు. మరో ఘటనలో అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వాహనం స్కిడ్డై కిందపడటంతో వెనుక కూర్చున్న మహిళ తీవ్ర గాయాలపాలై మృతిచెందింది. మరో ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వారు ముందు వెళ్తున్న భారీ వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి బ్యాలెన్స్ తప్పడంతో కిందపడిపోయారు. వెనకాల కూర్చున్న మహిళ మీద నుంచి భారీ వాహనం వెళ్ళడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. ఈ రోడ్డు ప్రమాదాలను పరిశీలించిన సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు.. బైక్ రైడర్‌తో పాటు వెనకాల కూర్చున్న వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే నిబంధనను అమలుచేయాలని నిర్ణయించారు. నాసిరకం హెల్మెట్లను ధరించవద్దని , హెల్మెట్ ధరించినా స్ట్రిప్ సరిగా పెట్టుకోవాలని సైబరాబాద్ సీపీ సజ్జనార్ సూచిస్తున్నారు. ద్విచక్రవాహనాలకు సైడ్ మిర్రర్‌లు తప్పనిసరిగా ఉండాలలని, సైడ్ మిర్రర్ లేని వాహనాలకు జరిమానా విధిస్తామని మరోసారి స్పష్టంచేశారు. బైకు వెనకాల కూర్చుంటున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో మోటర్ వెహికిల్ యాక్ట్ 129 కింద కేసులను నమోదు చేస్తామని సీపీ హెచ్చరిస్తున్నారు.

పోలీసులు సూచిస్తున్నట్టు వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించి ఉంటే ఈ నలుగురు మహిళలు గాయాలతో బయటపడేవారు. హెల్మెట్ పెట్టుకోకపోవడం నాలుగు కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చింది.

తబ్లీగి సభ్యులపై కేంద్రం కఠిన చర్యలు?

పదేళ్లపాటు నిషేధం విధించిన హోంశాఖ

న్యూఢిల్లీ,జూన్5(ఆర్ఎన్ఎ): నిబంధనలకు విరుద్ధంగా భారత్‌లో ప్రవేశించిన దాదాపు 960 మంది తబ్లిగీ జమాత్ విదేశీ సభ్యులకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ షాకిచ్చినట్లు తెలుస్తోంది. పదేళ్లపాటు దేశంలోకి సదరు వ్యక్తుల ప్రయాణాలపై నిషేధం విధించి.. బ్లాక్‌లిస్టులో పెట్టినట్లు సమాచారం. వీరిలో సలుగురు అమెరికన్లు, తొమ్మిది మంది బ్రిటిషర్లు, ఆరుగురు చైనీయులు ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కాగా ప్రాణాంతక కరోనా వ్యాప్తి నేపథ్యంలో ఢిల్లీలోని నిజాముద్దీన్‌లో జరిగిన తబ్లిగీ జమాత్ కార్యక్రమానికి వేలాది మంది హాజరుకావడం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. వీరిలో అత్యధికులకు మహమ్మారి సోకడం సహా వారంతా వివిధ రాష్ట్రాల్లో పర్యటించిన నేపథ్యంలో.. తబ్లిగీల ద్వారా దేశంలోని పలు ప్రాంతాల్లో వైరస్ వ్యాప్తి చెందిందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో లాక్‌డౌన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారన్న కారణంతో తబ్లిగీ చీఫ్ మౌలానా సాద్‌పై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. అదే విధంగా దాదాపు 67 దేశాల నుంచి టూరిస్టు వీసా మీద భారత్‌కు వచ్చి మతపరమైన సమావేశంలో పాల్గొని వీసా నిబంధలను ఉల్లంఘించిన విదేశీయులపై కూడా కేసులు నమోదయ్యాయి. అంతేగాక గల్ఫ్ దేశాల నుంచి ఢిల్లీలోని తబ్లిగీ జమాత్ పెద్దల ఖాతాల్లోకి కోట్లాది రూపాయల నిధులు మళ్లించినట్లు ఢిల్లీ క్రైంబ్రాంచ్ పోలీసుల విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో మౌలానాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మనీ ల్యాండరింగ్ కేసు నమోదు చేసింది. ఈ క్రమంలో మౌలానాకు అత్యంత సన్నిహితులు, ముఖ్య అనుచరులుగా భావిస్తున్న ఐదుగురి పాస్‌పోర్టులను సీజ్ చేసి విచారణ వేగవంతం చేశారు.

జనగామ జిల్లాలో కొనసాగుతున్న పారిశుద్య కార్యక్రమాల్లో భాగంగా కాల్వల పూడికతీత పనులను పరిశీలించిన మంత్రి ఎర్రబల్లి దయాకర్ రావు.

పారిశుద్య కార్యక్రమాల్లో ముందుండాలి

సీజనల్ వ్యాధులు రాకుండా చూసుకోవాలి
ప్రజలకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచన

జనగామ,జూన్5(ఆర్ఎన్ఎ): అంటు వ్యాధులు ప్రబల కుండా ప్రజాప్రతినిధులు, అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం, నియంత్రిత పంటల సాగు కార్యక్రమాల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు. పాలకుర్తి మండలంలోని తొర్రూరు, పాలకుర్తి, మంచిప్పలలో పారిశుద్ధ్యం, మురుగు కాలువలను పరిశీలించారు. పాలకుర్తిలో వైకుంఠధామం నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇతర నిర్మాణాలు, పారిశుద్ధ్య నిర్వహణ, పందులను గ్రామాలకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంచిప్పల గ్రామంలో వైకుంఠధామం, నర్సరీలను మంత్రి ఎర్రబెల్లి పరిశీలించి వైకుంఠధామంలో మొక్కలు నాటారు. సరేగా, పంచాయతీ నిధులతో వైకుంఠధామాలు, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే సర్పంచ్ లు, వార్డు సభ్యులు, అధికారులు సమన్వయంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమాల్లో జనగామ జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్ రెడ్డి, కలెక్టర్ నిఖిల, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

11నుంచి తిరుమల శ్రీవారి దర్శనం

8,9 తేదీల్లో టిటిడి ఉద్యోగులతో ట్రయల్
10న స్థానిక భక్తులకు దర్శన భాగ్యం
రోజుకు 3వేలమందికి ఆన్‌లైన్‌లో బుకింగ్ అవకాశం
అలిపిరి వద్ద 3వేల మందికి టిక్కెట్లు
అక్కడే వాహనాలకు థర్మల్ స్క్రీనింగ్: టిటిడి ఛైర్మన్ వైవి వెల్లడి

తిరుమల,జూన్5(ఆర్ఎన్ఎ): శ్రీవారి దర్శనానికి సాధారణ భక్తులను ఈ నెల 11నుంచి అనుమతిస్తామని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ప్రకటించారు. జూన్ 8, 9 తేదీల్లో టీటీడీ ఉద్యోగులను, 10వ తేదీన స్థానికులను దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల వరకూ మాత్రమే శ్రీవారి దర్శనానికి అనుమతి ఉంటుందని వైవీ స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో టికెట్లు తీసుకుని భక్తులు రావాలని, తిరుపతి అలిపిరి దగ్గర కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు. 10 ఏళ్ల లోపు చిన్నారులకు, 65 ఏళ్లు పైబడినవారికి దర్శనానికి అనుమతి లేదని వైవీ ప్రకటించారు. వీఐపీ దర్శనానికి కేవలం గంట మాత్రమే అనుమతి ఉంటుందని, శ్రీవారి మెట్టు మార్గాన్ని ఇంకొన్ని రోజులు అనుమతించమని టీటీడీ చైర్మన్ స్పష్టం చేశారు. పుష్కరిణిలోకి భక్తులను అనుమతించమని, అలాగే అన్నదానం, కళ్యాణకట్టలోకి అనుమతి లేదన్నారు. అలిపిరి దగ్గర ప్రతి ఒక్కరికీ థర్మల్ స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. కరోనా వైరస్ కారణంగా లాక్ డౌన్ ప్రకటించడంతో తిరుమల శ్రీ వారి దర్శనాన్ని మార్చిలో నిలిపివేశారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భక్తులకు వెంకన్న దర్శనం నోచుకోలేదు. తాజాగా కేంద్రం ఇచ్చిన సడలింపుల్లో భాగంగా శ్రీ వారి దర్శనం కల్పించాలని ÷ఆ నిర్ణయించింది. దీనికి సంబంధించిన వివరాలను టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి వెల్లడించారు. రోజు మూడువేలమంది భక్తులకు మాత్రమే దర్శనానికి అనుమతినవ్వడం జరుగుతుందని, ఈ నెల 11వ తేదీ నుంచి శ్రీ వారి దర్శనం ఉంటుందన్నారు. ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 7.30 వరకు మాత్రమే ఉంటుందని, దేశ వ్యాప్తంగా రాత్రి వేళ కర్ఫ్యూ ఉండడంతో ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. దర్శనానికి ఆన్ లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకోని వారు..నేరుగా తిరుపతికి వచ్చి చేసుకొనే అవకాశం కల్పించామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం నడచుకుంటామని అన్నారు. కంటైన్ మెంట్ జోన్లు, రెడ్ జోన్ల నుంచి వచ్చే భక్తులకు దర్శనానికి రావొద్దని సూచించారు.

ప్రార్థనామందిరాల్లో పూర్తిస్థాయి శానిటైజేషన్

పరిమిత సంఖ్యలో భక్తులకు అనుమతించేలా ఏర్పాట్లు
పిల్లలు వృద్ధులకు కొంతకాలం పాటు అనుమతి నిరాకరణ

న్యూఢిల్లీ,జూన్5(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ నిబంధనలు సడలించడంతో దేశంలోని ప్రధాన ఆలయాల్లో దర్శనానికి వచ్చే భక్తులకు సేవలందించడానికి ఆలయాలు సిద్ధమవుతున్నాయి. ఆలయాలను శానిటైజ్ చేసే పనలిలో సిబ్బంది పడింది. ఆలయాల్లో పూర్తి శానిటైజ్ చేయడంతో పాటు భక్తులు భౌతిక దూరం పాటించి వచ్చేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. కరోనా వ్యాప్తిని నిరోధించడానికి దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించడంతో దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు మార్చి నెలలో మూతపడ్డాయి. ఆలయాల్లో పూజాధికాలు జరుగుతున్నప్పటికీ భక్తులకు ప్రవేశం కల్పించడం లేదు. లాక్‌డౌన్ నిబంధనలను సడలించడంతో ఈ నెల 8 నుంచి ఆలయాలు తెరచుకోనున్నాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఆలయాల పరిసరాలను రసాయనాలతో శుభ్రం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దర్శనానికి వచ్చే భక్తులు భౌతిక దూరం పాటించడంతోపాటు, మాస్కులు తప్పనిసరిగా ధరించాలని దేవాలయ అధికారులు వెల్లడించారు. ఆలయ ప్రవేశ ద్వారం వద్ద శానిటైజేషన్ టన్నెల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. భౌతిక దూరం పాటించేలా ప్రత్యేకంగా మార్కింగ్ చేస్తున్నామని తెలిపారు. భక్తులు దేవతా మూర్తులను ముట్టు కోవడానికి వీల్లేదని, ప్రసాదాల పంపిణీ ఉండదని ఆయా ఆలయాల అధికారులు ప్రకటించారు.

దేవాలయంలోకి భక్తులను విడతలవారీగా అనుమతిస్తామని, ఒకసారి ఐదు నుంచి పది మందిని మాత్రమే దర్శనానికి అనుమతిస్తామని కొన్నిదేవాలయాల అధుకారులు ప్రకటించారు. ఆలయంలోకి ప్రవేశించే గేట్ వద్ద శానిటైజేషన్ టన్నెల్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. ఆలయంలో ప్రసాదాలను పంపిణీ చేయడం లేదని తెలిపారు. ఒడిశాలోని ప్రముఖ పూరీజగన్నాథ్ దేవాలయం భక్తుల దర్శనాలకు సిద్ధమవుతున్నది. స్వామివారికి స్నానపూర్ణిమ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పంజాబ్ అమృత్‌సర్‌లోని దుర్గియానా ఆలయంలో శానిటైజేషన్ నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దేవతా మూర్తులను, మత గ్రంథాలను ముట్టుకోవడం వంటివి చేయకూడదని, భక్తులను గుంపులుగా అనుమతించమని, భౌతిక దూరం పాటించాలని అధికారులు ప్రకటించారు. తమిళనాడులోని మధురైలో ఉన్న మురుగన్ దేవాలయంలో వైకాశి విశాఖం ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే తిరుమల, తిరుచానూరు, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీశైలం, సింహాచం, యాదాద్రి, వేములవాడ, భద్రాచలం, మహానంది, తదితర ఆలయాల్లో పూర్తి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని తక్సియత్ ఉల్ ఇమామ్ మసీద్‌ను ప్రార్థనల కోసం సిద్ధం చేస్తున్నారు. మసీదు మొత్తాన్ని శానిటైజేషన్ చేశారు. ప్రార్థనల కోసం వచ్చేవారు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, భౌతిక దూరం పాటించాలని మసీదు అధికారులు చెప్పారు. అలాగే చర్చిలను కూడా శానిటైజ్ చేస్తున్నారు.

మురికికాలువలో చెత్త వేస్తే జరిమానా: స్పీకర్ పోచారం

కామారెడ్డి,జూన్ 5: బాన్సువాడ పట్టణంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ప్రధాన రహదారి వెంట అధికారులతో స్పీకర్ పోచారం కలియతిరిగారు. దుకాణ సముదాయ వ్యాపారులకు..ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఓ దుకాణం ముందు మురికాకాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్నిపరిశీలించారు.

దుకాణ షాపుల యజమానులు, ప్రజలు మురికికాలువలో చెత్తవేయడం ద్వారా..ఎక్కడిక్కడ నీరు నిలిచిపోతుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దుకాణాల ముందు చెత్తాచెదారం ఉంటే కొత్త మున్సిపల్ చట్టం క్రింద జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

మనకు వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉండాలంటే మన ఊరు శుభ్రంగా ఉండాలి. చెత్తవేయకుండా ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకుంటే ఊరు, పట్టణం శుభ్రంగా పట్టణం శుభ్రంగా ఉంటుందని..దీనికి ప్రజలందరి సహకారం కావాలని కోరారు. స్పీకర్ పోచారం వెంట ఆర్డీవోతోపాటు పలువురు అధికారులున్నారు.

కొత్త పథకాలకు అనుమతి నిరాకరణ

-ఆర్థిక శాఖ నిర్ణయం

న్యూఢిల్లీ,జూన్5(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్‌తో ఏర్పడిన లాక్‌డౌన్ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా స్తంభించి పోయింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కూడా కఠిన నిర్ణయం తీసుకున్నది. ఈ ఏడాదిలో ఎటువంటి కొత్తస్కీమ్‌ను అమలు చేయడంలేదని కేంద్ర ఆర్థికశాఖ స్పష్టం చేసింది. కరోనా ఉధృతి నేపథ్యంలో ఖర్చును తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కొత్త స్కీమ్‌లకు సంబంధించిన అభ్యర్థన లను కేంద్ర ఆర్థికశాఖకు పంపవద్దు అంటూ అన్ని మంత్రిత్వశాఖలకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం నిధుల కేటాయింపు కేవలం ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ ప్యాకేజీకి మాత్రమే ఉంటుందని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. కొత్త పథకాలకు మాత్రం ఆమోదం ఉండదని తేల్చి చెప్పారు. కోవిడ్19 నేపథ్యంలో ప్రభుత్వ నిధులకు ఎక్కువ డిమాండ్ ఉన్నదని, అయితే అవసరాలకు తగినట్లు నిధుల మంజూరీ ఉంటుందని ఆర్థికశాఖ ఓ ప్రకటనలో పేర్కొన్నది. కేంద్ర బ్జడెట్ కింద ఇప్పటికే కొన్ని స్కీమ్‌లకు కేటాయించిన నిధులను కూడా నిలిపివేస్తున్నట్లు ఆర్థికశాఖ వెల్లడించింది.

గుజరాత్‌లో రాజ్యసభ రాజకీయాలు

-కాంగ్రెస్‌కు మొత్తం 8 మంది ఎమ్మెల్యేల రాజీనామా

గాంధీనగర్,జూన్5(ఆర్ఎన్ఎ): రాజ్యసభ ఎన్నికల ముందు గుజరాత్ లో కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన మొత్తం 8 మంది ఎమ్మెల్యేల తమ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. గతంలో ఐదుగురు ఎమ్మెల్యేల రాజీనామా చేయగా.. బుధవారం మరో ఇద్దరు.. తాజాగా మరొకరు రాజీనామా చేయడంతో శాసనసభలో ఆ పార్టీ బలం మరింత తగ్గింది. శుక్రవారం కాంగ్రెస్ ఎమ్మెల్యే బ్రిజేష్ మెర్జా అసెంబ్లీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. మోర్బీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎన్నికైన బ్రిజేష్ మెర్జా తన రాజీనామాను స్పీకర్ రాజేంద్ర త్రివేది అంగీకరించినట్లు అసెంబ్లీ సచివాలయం ధృవీకరించింది.

కాగా శాసనసభ్యుడు పదవి నుంచి తప్పుకునే ముందు, మెర్జా కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. దీంతో గత మూడు రోజుల్లో కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన వారి సంఖ్య మూడుకు చేరింది. అలాగే గతంలో ఐదు మంది రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. మొత్తం ఎనిమిది మంది సభ్యుల రాజీనామాతో.. గుజరాత్ అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 57కు తగ్గింది.

శ్రామిక్ రైలులో ప్రసవించిన మహిళ

భువనేశ్వర్,జూన్5(ఆర్ఎన్ఎ): వలస కార్మికులను స్వస్థలాలకు పంపించేందుకు ఏర్పాటు చేసిన శ్రామిక్ స్పెషల్ ట్రైన్‌లో ఓ గర్భిణీ మహిళ పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఒడిశాకు చెందిన మీనా కుంభర్ అనే గర్భిణీ మహిళ తన కుటుంబసభ్యులతో కలిసి తెలంగాణలోని లింగంపల్లి నుంచి ఒడిశాలోని బాలాంగిర్‌కు ప్రత్యేక రైలులో వెళ్తుంది. అయితే మార్గమధ్యలో మీనా కుంభర్ డెలివరీ అయింది. శుక్రవారం ఉదయం 5.40 నిమిషాలకు రైలు టిట్లాగఢ్ స్టేషన్ కు రాగానే..రైల్వే వైద్య సిబ్బంది తల్లీబిడ్డలను పరీక్షించి ఆరోగ్యంగా ఉన్నట్లు నిర్ధారించారు. ఆ తర్వాత తల్లీబిడ్డను ఏడీఎంవో సూచనల మేరకు జనని అంబులెన్స్ లో జిల్లా సబ్ డివిజనల్ హాస్పిటల్ కు తరలించారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని శ్రామిక్ స్పెషల్ ట్రైన్ లో ఇప్పటివరకు ముగ్గురు చిన్నారులు జన్మించారు. ఇప్పటివరకు రైళ్లలో 37మంది జన్మించారు.

కెటిఆర్ ఫామ్‌హౌజ్‌పై ఎన్జీటి నోటీసులు

-విచారణకు కమిటీ ఏర్పాటు చేస్తూ ఆదేశాలు

న్యూఢిల్లీ,జూన్5(ఆర్ఎన్ఎ): సిఎం కెసిఆర్ తనయుడు,తెలంగాణ మంత్రి, కేటీఆర్‌కు నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ నోటీసులు జారీ చేసింది. జీవో 111ను ఉల్లంఘిస్తూ ఫామ్ హౌజ్ నిర్మించారంటూ ఇటీవల ఆరోపణలు చేసిన ఎంపి రేవంత్ రెడ్డి.. ఎన్జీటీలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విచారణ జరిపిన గ్రీన్ ట్రిబ్యునల్.. కేటీఆర్‌తో పాటు, తెలంగాణ ప్రభుత్వం, పీసీబీ, హెచ్ఎండీఏకు నోటీసులు ఇచ్చింది. అంతేగాక ఓ నిజనిర్ధారణ కమిటీని కూడా నియమించింది. ఈ కమిటీలో సభ్యులుగా సెంట్రల్ ఎన్విరాన్మెంట్ రిజిస్ట్రీ ప్రాంతీయ కార్యాలయం, తెలంగాణ పీసీబీ, జీహెచ్ఎంసి, వాటర్ వర్క్స్, హెచ్ఎండీఏ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను చేర్చింది. 2 నెలల్లో నివేదిక సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. మంత్రి కేటీఆర్ జన్వాడ ఫామ్ హౌస్ ముట్టడి కేసులో కాంగ్రెస్ ఎంపీ రేవంత్ రెడ్డిని గతంలో పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆయనతో పాటు అక్కడికి వెళ్లిన మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డిని కూడా అప్పట్లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గండిపేట చెరువుకు వెళ్లే దారిలో కేటీఆర్ విలాసవంతమైన ఫామ్ హౌస్ కట్టుకున్నారని ఎంపీ రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ ప్రాంతం 111 జీవో పరిధిలోకి వస్తుందని, కేంద్ర ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి 25 ఎకరాల స్థలంలో ఈ నిర్మాణం చేపట్టారని రేవంత్ విమర్శించారు. అక్కడ డ్రోన్లతో పరిశీలన చేశారని పోలీసులు కేసు పెట్టారు. దీనిపై రేవంత్ చేసిన విమర్శలపై ఎలాంటి సమాధానం రాలేదు.

యాదాద్రి బాలాలయంలో భక్తులకు దర్శనాలు

ఏర్పాట్లు చేస్తున్న ఆలయ అధికారులు

యాదాద్రి భువనగిరి,జూన్5(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో సుప్రసిద్ధ యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో దర్శనాల కోసం దేవాదాయశాఖ ఆదేశాల మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కరోనా నేపథ్యంలో కంటైన్మెంట్ జోన్లు మినహా మిగతా ప్రాంతాల్లో ఈ నెల 8 వ తేదీ నుంచి అన్ని ప్రార్థనా మందిరాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహుని బాలాలయానికి భక్తులు పోటెత్తే అవకాశం ఉండటంతో.. ఏర్పాట్లు కూడా అదే స్థాయిలో చేస్తున్నారు. మొదటి రోజు నుంచే ఆర్జిత పూజలు చేసుకొనే అవకాశం కల్పిస్తున్నారు. దీనికితోడు భౌతికి దూరం పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు. పరిమిత సంఖ్యలో భక్తులను అనుమతించే అవకాశాలు ఉన్నాయి. ఇదిలాఉండగా, కరోనా నేపథ్యంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తుల రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలపై దేవాదాయ శాఖ కమిషనర్‌ను అనిల్‌కుమార్‌ను కలిసి యాదాద్రి ఆలయ ఈవో ఎన్ గీత చర్చించారు. భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకొంటున్నట్లు వివరించారు. కొండ కింద నుంచి భక్తులు కాలినడకన కొండపైకి చేరుకోవడం కోసం ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదని, అనుమతి వచ్చేలోగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో గీత మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వం తీసుకునే

ప్రభుత్వ దవాఖానలో కరోనా టెస్టింగ్ ల్యాబ్ ప్రారంభం

జోగులాంబ గద్వాల,జూన్ 5 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానలో కరోనా టెస్టింగ్ ల్యాబ్, హెపటైటస్ బి, చిన్న పిల్లల వార్డులను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఆలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం, జడ్పీ చైర్ పర్సన్ సరిత, జిల్లా కలెక్టర్ శృతి ఓఝాతో కిలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ దవాఖానలోని కరోనా టెస్టింగ్ ల్యాబ్ లో ప్రతిరోజు టెస్టులు చేస్తారన్నారు. దీంతో జిల్లా ప్రజలకు దూర భారం తప్పుతుందన్నారు.

అలాగే హాస్పిటల్స్ లో అందుతున్న వైద్య సేవలపై ఎమ్మెల్యే గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకరావాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ తో మాట్లాడి త్వరలోనే గద్వాల దవాఖానకు సరిపడా డాక్టర్లను నియమిస్తామన్నారు. కరోనా టెస్టింగ్ ల్యాబ్ లో పరికరాలను పరిశీలించారు. గద్వాల ప్రభుత్వ దవాఖానలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు.

8నుంచి ఆన్‌లైన్ బుకింగ్‌లు

సిఫార్సు లేఖలకు అనుమతి లేదు

దర్శనం టిక్కెట్లు ఉన్న వారకే గదుల కేటాయింపు: ఇవో

తిరుమల,జూన్5(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ కారణంగా తిరుమల శ్రీవారి ఆలయంలో రెండు నెలలకు పైగా నిలిచిపోయిన భక్తుల దర్శనాలను తిరుమల తిరుపతి దేవస్థానం తిరిగి పునఃప్రారంభిస్తోంది. ఈ మేరకు ఏర్పాట్లను చురుకుగా చేపట్టింది. అలాగే 8నుంచి ఆన్‌లైన్ టిక్కెట్లు బుక్ చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

భక్తుల రాకకు అనుగుణంగా .. తొలుత ఈనెల 8 నుంచి టీటీడీ ఉద్యోగులు, స్థానికులతో మూడ్రోజులపాటు ప్రయోగాత్మకంగా ట్రయల్ రన్ పద్ధతిలో దర్శనాలను టీటీడీ ప్రారంభించ నుంది. ఈ సందర్భంగా అన్ని ఏర్పాట్లను టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ అనిల్ కుమార్ సింఘాల్ పరిశీలించారు. అనంతరం అనిల్‌కుమార్ సింఘాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఈ నెల 8 నుంచి ఆన్‌లైన్‌లో శ్రీవారి దర్శనం టికెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో రోజుకు మూడు వేల టికెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఆన్‌లైన్‌లో దర్శనం టికెట్లు కొనుగోలు చేసిన వారికి గదులు కేటాయిస్తామని పేర్కొన్నారు. సరి, బేసి పద్ధతిలో గదుల కేటాయింపు ఉంటుందని, ఒక్కో రూమ్‌లో ఇద్దరికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. గ్రామ సచివాలయాల్లో కూడా ఆన్‌లైన్‌లో టికెట్లు కొనుగోలు చేసుకోవచ్చని ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సూచించారు. క్యూలైన్‌లో విధులు నిర్వహించే వారికి పీపీఈ కిట్లు ఇస్తామన్నారు. బస్సులతో పాటు భక్తుల లగేజీని కూడా పూర్తిగా శానిటైజ్ చేస్తామన్నారు. ప్రతీ రెండు గంటలకు ఒకసారి లడ్డూ కౌంటర్లను మారుస్తామని తెలిపారు. రోజూ ర్యాండమ్‌గా 200 మంది భక్తులకు పరీక్షలు నిర్వహిస్తామని, పరీక్షల తర్వాతే కొండపైకి అనుమతినిస్తామన్నారు. ప్రస్తుతానికి కల్యాణకట్ట వద్దకు అనుమతి లేదన్నారు. హుండీ, అన్నప్రసాదం దగ్గర జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఈవో సూచించారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లో కూడా పరిమితంగానే భక్తులకు అనుమతిస్తామన్నారు. తిరుమలలో గడువు దాటిన వస్తువులు తొలగిస్తామన్నారు. కేంద్రం నిబంధనల పర్యవేక్షణకు సీనియర్ అధికారులు నియమిస్తామని తెలిపారు. ఇతర రాష్ట్రాలనుంచి వచ్చే వారు ప్రభుత్వ నిబంధనలు తప్పకుండా పాటించాలని ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే శ్రీవారి భక్తులు ఆయా రాష్ట్రల అనుమతితోనే టికెట్లు తీసుకోవాలని టీటీడీ అదనపు ఈవో ధర్మారెడ్డి పేర్కొన్నారు. 24 గంటలు పర్యవేక్షిస్తూ భక్తుల దర్శనానికి అనుమతిస్తామన్నారు. ఉదయం గంట మాత్రమే ప్రోటోకాల్ వీఐపీఎలకు అనుమతి ఉంటుందన్నారు. సిఫార్సు లేఖలకు అనుమతి లేదన్నారు. శ్రీవాణి ట్రస్ట్ భక్తులకు ప్రస్తుతానికి అనుమతి లేదని ధర్మారెడ్డి పేర్కొన్నారు.

అబ్దుల్ రహీం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎగ్ బిర్యానీ పంపిణీ

వేములవాడ, జూన్ 5 (నేటినిజంప్రతినిధి): దివంగత అబ్దుల్ రహీం చారిటబుల్ ట్రస్ట్ (హెల్ప్ ద హెల్ప్ లెస్) ఆధ్వర్యంలో శుక్రవారం ఒమేగా సుశ్రుతక్యాన్సర్ ఆసుపత్రిలో 150 మందికి మధ్యాహ్న భోజనం ఎగ్ బిర్యానీ పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ అబ్దుల్ కరీం మాట్లాడుతూ మ తండ్రి అయినఅబ్దుల్ రహీం చాలా మంది నిరుపేదలకు వివిధ రకాల సాయం అందించేవారని, మా కుటుంబ సభ్యులం ఒక్కటై ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించి పేదలకు తమవంతు సాయాన్ని అందించేందుకు కృషి చేస్తామన్నారు. తద్వారా తన తండ్రి అబ్దుల్ రహీం ఆశయ సాధన కోసం పాటు పడతామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రి, మాతా శిశు ప్రసూతి ఆసుపత్రి, రక్తదానం, అవసరాన్ని బట్టి సేవా కార్యక్రమాల నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షుడు అక్తర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి ఖదీర్, సహాయ కార్యదర్శి ఎక్బాల్ అహ్మద్, కోశాధికారి శంకర్, సభ్యులు సయ్యద్ అహ్మద్, అబ్దుల్ అలిమ్, షేక్ నసీర్, దివాకర్, ఫైజాన్, రిజ్వాన్, వసీం అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ లో నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం

నిర్మల్,జూన్ 5 : నకిలీ విత్తనాల విక్రేతలపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. రైతులను మోసం చేస్తూ నకిలీ విత్తనాలు అమ్మే వారిపై ఉక్కుపాదం మోపాలని డీజీపీ మహేందర్ రెడ్డి ఆదేశించడంతో పోలీసులు, వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు.జిల్లాలోని కడెం మండలం అల్లంపల్లి, పాలరేగడి, బాబానాయక్ తండాల్లో ఒక వ్యక్తి నకిలీ పత్తి విత్తనాలు తన ఇంట్లో పెట్టుకొని గ్రామస్తులకు అమ్ముతున్నాడని సమాచారం రాగా కడెం ఎస్ఐ, మండల వ్యవసాయ అధికారితో కలిసి దాదాపు 116 నకిలీ పత్తి విత్తనాల ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ శశిధర్ రాజుతెలిపారు. వాటి విలువ 1,16000 వరకు ఉంటుందని అన్నారు. నకిలీ విత్తనాలు కలిగియున్న తొడసం నరేష్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విత్తనాలను స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు. అపరిచిత వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి ఈ విత్తనాల బస్తాలను ఇచ్చారని, ఒక్కొక్క ప్యాకెట్ 1000 రూపాయలకు అమ్మి పెడితే రెండు వందల రూపాయలు కమీషన్ ఇస్తామని చెప్పడంతో అత్యాశకు పోయి విత్తనాల దుకాణం వ్యాపారి కేసులో ఇరుక్కున్నారని తెలిపారు. వ్యాపారులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ నకిలీ పత్తి విత్తనాలు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు సరఫరా చేశారు? అతను జిల్లాలో ఇంకా ఎవరికైనా ఇచ్చారా? అనే అంశాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. రైతులు విడి విత్తనాలు కొనుగోలు చేయవద్దని తతక్కువ ధరకు లభిస్తున్నాయని ఆశతో విడి విత్తనాలు కొని రైతులు మోసపోవద్దని ఎస్పీ సూచించారు.నకిలీ విత్తనాలు అమ్మే వారిపై పీడీ యాక్ట్ కేసులు కూడా నమోదు చేసేందుకు వెనకాడేది లేదని హెచ్చరించారు. అలాగే ఖానాపూర్ మండల కేంద్రంలోని విత్తనాలు, రసాయన ఎరువుల దుకాణాలను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

దేశవ్యాప్తంగా 200 అర్బన్ ఫారెస్ట్‌ల అభివృద్ధి

ఢిల్లీ, జూన్ 5 : దేశవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో 200 అర్బన్ ఫారెస్ట్‌లను అభివృద్ధి చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రతీ ఏడాది జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్న సంగతి తెలిసిందే. కోవిడ్-19 సంక్షోభం కారణంగా వర్చువల్‌గా వేడుకలను జరిపింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్రం నేడు 'నగర్ వన్' పథకాన్ని ప్రకటించింది. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను కేంద్ర పర్యావరణశాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్ జవదేకర్ మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో 200 అర్బన్ ఫారెస్టులను అభివృద్ధి చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, మున్సిపల్ విభాగం, ఎన్జీవోలు, కార్పొరేట్స్, స్థానిక పౌరులు, ప్రజల సహకారం, భాగస్వామ్యంతో ఈ నగర వనాలను అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. యూనైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ఈ ఏడాది పలు కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. బయోడైవర్సిటీ ఈ ఏడాది థీమ్ కాగా.. కేంద్రం థీమ్ నగర్ వన్(అర్బన్ ఫారెస్ట్).

నగరానికి ఊపిరితిత్తులుగా అర్బన్ ఫారెస్ట్‌లు...

ఈ పార్కులు నగరాల ఊపిరితిత్తులుగా పనిచేస్తాయని ప్రకాశ్ జవదేకర్ తెలిపారు. అటవీశాఖకు చెందిన భూముల్లోనే మొదటగా మొక్కల పెంపకం చేపడతామన్నారు. అనంతరం స్థానిక సంస్థలు అందించే భూముల్లో వనలా అభివృద్ధిని చేపడతామన్నారు. ప్రత్యేక ఏకాగ్రతతో జీవ వైవిధ్యానికి ప్రకృతి కోసం సమయం కేటాయించాలన్నారు. ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందన్నారు. ప్రపంచ జీవవైవిధ్యంలో భారతదేశం 8 శాతాన్ని కలిగిఉందని మంత్రి తెలిపారు. ప్రపంచ భూభాగంలో 2.5 శాతం, జనాభాలో 16 శాతం, పశు సంతతి, 4 శాతం మాత్రమే మంచినీటి వనరులను కలిగి ఉండటం వంటి అనేక అవరోదాలు ఉన్నప్పటికీ జీవవైవిధ్యంలో భారత్ తన వంతు పాత్ర పోషిస్తుందన్నారు. జీవవైవిధ్యం భారతీయ సంస్కృతిలో భాగమని పేర్కొన్నారు.

పారిశ్రామికవేత్తలతో నిజాయితీగా వ్యవహరించాలి - ఏపీ సీఎం జగన్

అమరావతి,జూన్ 5: ఏపీలో పరిశ్రమలు, పెట్టుబడులకు వచ్చే పారిశ్రామిక వేత్తలతో నిజాయితీగా,నిబద్ధతతో కలసి పనిచేస్తే ప్రజలకు, పారిశ్రామిక వేత్తలకు ఎంతగానో మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి జగన్ అన్నారు. నూతన పారిశ్రామిక విధానంపై నేడు తాడెపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో మాట్లాడారు.

పారిశ్రామిక వేత్తలను, ఔత్సాహికులను ప్రోత్సహిస్తే రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తారని, ఆ దిశగా పరిశ్రమ విధానాలు అనుకూలంగా ఉండాలని సూచించారు. పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని సీఎం జనగ్ అన్నారు.

పరిశ్రమలకు నీరు, విద్యుత్, భూమిలాంటి సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అనుమతుల కోసం వచ్చే వారికి ఇబ్బందులు కలిగించవద్దని,నిర్ధేశిత గడువులోగా పరిశ్రమల ప్రారంభానికి సహకరించాలని, త్వరలో నూతన పారిశ్రామిక విధాన రూపకల్పనకు మెరుగైన సూచనలు ఇవ్వాలని అధికారులకు ఆయన సూచించారు.

పర్యావరణ పరిరక్షణ మన విధానం కావాలి

-ఒక్కో విద్యార్థి ఒక్కో మొక్క నాటాలి: హరీష్ రావు

సిద్దిపేట,జూన్5(ఆర్ఎన్ఎ): భూమండలంలో అన్నిటికంటే విలువైనది ప్రకృతి అని..జీవ కోటి మనుగడ ప్రకృతి, పర్యావరణంపై ఆధారపడి ఉందని మంత్రి హరీష్ రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మంత్రి హరీశ్ రావు ప్రజలకు సందేశాన్నిఇచ్చారు. మొక్కలు లేకపోతే మానవ మనుగడనే ప్రశ్నార్థకం అవుతుందని హరీశ్ రావు అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు ఎన్నో ప్రకృతి పై దృష్టి పెడుతున్నాయని.. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి..వాటిని సంరక్షించాలి కోరారు. చెట్లను నాటడం వాటిని సంరక్షించడం ఉద్యమ తరహాలో చేపట్టాలని సూచించారు. ప్రకృతి సంరక్షణ మన అందరి బాధ్యత..130 కోట్ల జనాభా కలిగిన మన భారతదేశం చెట్లను నాటి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి మీద ఉందని మంత్రి హరీశ్ రావు అన్నారు. సహజ వనరుల పరిరక్షణ ఉద్యమంలా చేపట్టాలని పిలుపునిచ్చారు. కాలుష్యం బాగా పెరిగి కొత్త కొత్త వ్యాధులు, క్యాన్సర్ లాంటి వ్యాధుల బారిన పడుతున్నామని అన్నారు.కాలుష్యాన్ని నియంత్రించేం దుకు..చెట్లను పెంచడం..అడవులను సంరక్షించడం.. ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలన్నారు. ప్రతి ఒక్క రు ఒక మొక్క నాటాలని విజ్ఞప్తి చేశారు. రా నున్న రోజుల్లో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో కూడా ప్రకృతి, పర్యావరణంపై బోధించాలని ప్రతి ఒక్క విద్యార్థితో మొక్క నాటించాలని పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు సూచించారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కను నాటిన మంత్రి హరీష్ రావు

ఆరేళ్ల పాలనలో హామీలకు దిక్కేది?

ప్రాజెక్టులు సందర్శిస్తే కేసీఆర్‌కు భయమెందుకు
పోడు రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు
కౌలు రైతులను కష్టాలకు వదిలేశారు: పొన్నం

కరీంనగర్,జూన్5(ఆర్ఎన్ఎ): తెలంగాణ వస్తే ఇంటికో ఉద్యోగం వస్తుందని కేసీఆర్ అనేక సందర్భాల్లో ప్రకటనలు చేసిన మాట వాస్తవమని ..కానీ తాను అలా అనలేదని ఇప్పుడు దబాయిస్తున్నారని మాజీ ఎంపి, కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో వేలాది సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నా వాటిని భర్తీ చేయడం లేదన్నారు. విశ్వవిద్యాలయాల్లో విసి, లెక్చరర్, ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాఎందుకనో భర్తీ చేయడం లేదన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో, సంస్థల్లో లక్షలాది మంది అవుట్ సోర్సింగ్ పద్ధతుల్లో ఏండ్ల తరబడి పని చేస్తున్నా, వారిని పర్మనెంట్ చేయడం లేదన్నారు. పర్మినెంట్ చేస్తామన్న హామీని కూడా కెసిఆర్ మరచారని అన్నారు. వారితో వెట్టి చేయించుకుంటూ చాలీచాలని వేతనాలను చెల్లిస్తూ అన్యాయం చేస్తున్నారు. మాకు న్యాయం చేయమని పోరాడిన వారి ఉద్యోగాలను తొలగిస్తున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టల సందర్శనకు వెళితే కెసిఆర్ ఎందుకు భయపడుతున్నారని అన్నారు. ప్రాజెక్టుల వద్దకు వెళ్లి నిజాలు ప్రజలకు చెబుతామన్న భయం పట్టుకుందన్నారు. ప్రాజెక్టుల పేరుతో భూసేకరణ కింద పేద, మధ్యతరగతి రైతుల నుంచి భూములు బలవంతంగా తీసుకొని, న్యాయమైన పరిహారం ఇవ్వక పోవడం విచారకర మన్నారు. లక్ష కోట్లు ఖర్చు పెట్టి కోటి ఎకరాలకు సాగునీరందిస్తామని, అనేక ప్రాజెక్టులకు రీడిజైన్, రీఎస్టిమేట్స్ చేసి ఇప్పటికే వేల కోట్లు ఖర్చు పెట్టారని పొన్నం అన్నారు. పేద గిరిజనులకు ముఖ్యంగా పోడు భూములకు పట్టాలు ఇస్తామన్న హామీ నెరవేర లేదన్నారు. ప్రతి పేద కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇస్తామని కల్పించిన ఆశ నిరాశగానే ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ సమసయంలో మాట్లాడిన మాటలకు పాలనకు పొంతన లేకుండా పోయిందని విమర్శించారు. ఇదేనా ఈ ప్రాంత ప్రజలు కోరుకున్నదని ఆయన ప్రశ్నించారు. ఆర్టీసీ సమ్మె, అంగన్‌వాడీ, మున్సిపల్ వర్కర్స్, ఆయాలు చేసిన సమ్మెలపై ఉక్కుపాదం మోపి లొంగదీసు కున్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక హక్కులను హరిస్తూ దుర్మార్గంగా వ్యవహరిస్తున్న తీరు నిజాం పాలనను తలపిస్తోందని అన్నారు. నియంతృత్వ పోకడలను మానుకోవాలని అన్నారు. ఈ ఆరేళ్లలో లోపాలను సమీక్షించుకుని , సమస్యలపై దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి కృషి చేస్తేనే ప్రజల్లో మన్నన ఉంటుందన్నారు. తెలంగాణ ఆవిర్భవించి ఆరేండ్లు పూర్తయినా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న వారికి న్యాయం జరగలేదన్నారు బంగారు తెలంగాణగా పేరుతో దగా చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వకుంటే కెసిఆర్ ఎక్కడ ఉండేవారన్నారు. ఇటీవల మరో కుట్ర పూరిత విధానానికి తెరతీసారని అన్నారు. ప్రభుత్వం చెప్పిన పంటలు వేయనిచో రైతుబంధు నిలిపివేస్తా మని ముఖ్యమంత్రి స్వయంగా రైతులను బెదిరిస్తుండటం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలో కౌలు రైతులు సుమారు 20 లక్షల మంది వరకూ ఉంటారని వారిని ఆదుకోవడానికి ఎలాంటి పథకం చేపట్టలేదన్నారు. శాసనసభ సాక్షిగా కౌలురైతులను గుర్తించమనీ, గుర్తింపు కార్డులు ఇవ్వమనీ కరాఖండిగా తేల్చి చెప్పారని, కనీసం వారిని ఆదుకోవాలన్న ధ్యాస కూడా పెట్టడం లేదన్నారు.

ఎపి ప్రభుత్వం మరో వినూత్న ప్రక్రియ

దేశంలోనే మొదటిసారిగా పారిశ్రామికి వ్యర్థాల సేకరణ ఆన్‌లైన్ వేదికగా వ్యర్థాల సేకరణకు ప్లాట్‌ఫామ్ ఏర్పాటు
పర్యావరణ దినోత్సవాన లాంఛనంగా ప్రారంభించిన సిఎం జగన్

అమరాతి,జూన్5(ఆర్ఎన్ఎ): పారిశ్రామిక సంస్థలు ఏమాత్రం కష్టపడాల్సిన పనిలేకుండా.. తమ వద్ద ఉన్న వ్యర్థాల గురించి ఆన్‌లైన్‌లో నమోదుచేస్తే వాటిని తీసుకెళ్లి కాలుష్య రహితంగా ట్రీట్ చేసే ప్రణాళికను ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సిద్ధం చేసింది. ఆంధ్రప్రదేశ్ పర్యావరణ నిర్వహణ సంస్థ అధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన వ్యర్థాల బదలాయింపునకు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ను శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ ఈఎంసీని ప్రారంభించారు. పరిశ్రమల నుంచి వ్యర్థాల నిర్వహణ బాధ్యతలను ఇకపై ఏపీఈఎంసీ చేపట్టనుంది. పర్యావరణ నియమాలు, నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయనుంది. దీని కోసం దేశంలోనే మొదటిసారిగా ఆన్‌లైన్ వేస్ట్ ఎక్స్ఛేంజ్ ఎ÷-లాట్‌ఫాంను ఏర్పాటు చేశారు. వ్యర్థాల నిర్వహణలో కచ్చితమైన ట్రాకింగ్, స్ట్రూట్రీ, ఆడిటింగ్ పక్రియలు నిర్వహించనున్నారు. కాగా.. కలుషిత వ్యర్థాలను సమర్థంగా నిర్వహించే సంస్థలను ఆన్‌లైన్ వేదికగా కలిపేందుకు ఆంధ్రప్రదేశ్ పర్యావరణ నిర్వహణ సంస్థ నంధానకర్తగా వ్యవహరిస్తుంది. ఇందుకుగాను వ్యర్థాల నిర్వహణ సంస్థలకు, ఏపీఈఎంసీకి పరిశ్రమలు కొంత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఈ తరహా ఆన్‌లైన్ వేస్ట్ ఎక్స్ఛేంజ్ ప్లాట్‌ఫామ్ దేశంలోనే ఇది మొదటిది కావడం విశేషంకార్యక్రమంలో మంత్రులు గౌతంరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, బాలినేని శ్రీనివాసరెడ్డి, సీఎస్ నీలం సాహ్ని, స్పెషల్ చీఫ్‌సెక్రటరీ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ నీరబ్‌కుమార్ ప్రసాద్, ఏపీపీసీబి మెంబర్ సెక్రటరీ వివేక్‌యాదవ్ పాల్గొన్నారు. ఎపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కాలుష్య నివారణకు అవకాశం ఏర్పడింది. ఇక నుంచి వ్యర్థాల నిర్వహణ కోసం పారిశ్రామిక సంస్థలు ఏమాత్రం కష్టపడాల్సిన పనిలేదు. తమ వద్ద ఉన్న వ్యర్థాల గురించి ఆన్‌లైన్‌లో నమోదుచేస్తే వాటిని తీసుకెళ్లి కాలుష్య రహితంగా ట్రీట్ చేసే ప్రణాళికను ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సిద్ధం చేసింది. ఈ సందర్భంగా ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. కలుషిత వ్యర్థాలను సమర్థంగా నిర్వహించే ట్రీట్‌మెంట్ వ్యవస్థలేని పరిశ్రమలు ఈ ట్రీట్‌మెంట్ వ్యవస్థలేని పరిశ్రమలు ఈ వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించే సంస్థలకు అప్పగించాల్సి ఉంటుంది. ఇలా పరిశ్రమలు, వ్యర్థాల సమర్థ నిర్వహణ సంస్థలను ఆన్‌లైన్ వేదికగా కలిపేందుకు ఆంధ్రప్రదేశ్ పర్యావరణ నిర్వహణ సంస్థ నంధానకర్తగా వ్యవహరిస్తుంది. ఇందుకుగాను వ్యర్థాల నిర్వహణ సంస్థలకు, ఏపీఈఎంసీకి పరిశ్రమలు కొంత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఈ తరహా ఆన్‌లైన్ వేస్ట్ ఎక్స్ఛేంజ్ ప్లాట్‌ఫామ్ దేశంలోనే ఇది మొదటిది కావడం గమనార్హం.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎపిలో ఆన్‌లైన్‌లో పారిశ్రామిక వ్యర్థాల సేకరణ పథకాన్ని ప్రారంభించిన సిఎం వైఎస్ జగన్

ఊరు బాగుండాలంటే చెత్త వేయరాదు

ప్రజలు తమ ఊరు బాగుండాలని కోరుకోవాలి:స్పీకర్

కామారెడ్డి,జూన్5(ఆర్ఎన్ఎ): మనకు వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉండాలంటే మన ఊరు శుభ్రంగా ఉండాలని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. చెత్తవేయకుండా ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకుంటే ఊరు, పట్టణం శుభ్రంగా పట్టణం శుభ్రంగా ఉంటుందని..దీనికి ప్రజలందరి సహకారం కావాలని కోరారు. ఎవరికి వారు తమ ఊరు బాగుండాలని కోరుకోవాలని అన్నారు. బాన్సువాడ పట్టణంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ప్రధాన రహదారి వెంట అధికారులతో స్పీకర్ పోచారం కలియతిరిగారు. దుకాణ సముదాయ వ్యాపారులకు..ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఓ దుకాణం ముందు మురికాకాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్నిపరిశీలించారు. దుకాణ షాపుల యజమానులు, ప్రజలు మురికికాలువలో చెత్తవేయడం ద్వారా..ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. దుకాణాల ముందు చెత్తాచెదారం ఉంటే కొత్త మున్సిపల్ చట్టం క్రింద జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. స్పీకర్ పోచారం వెంట ఆర్డీవోతోపాటు పలువురు అధికారులున్నారు.

ఏరువాకలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఏలూరు,జూన్5(ఆర్ఎన్ఎ): దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతు భరోసా కేంద్రాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. శుక్రవారం దెందులూరు నియోజకవర్గం సత్యనారాయణపురంలో ఎరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రైతులతో కలిసి దుక్కి దున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరుణ దేవుడు కరుణించడంతో వర్షాలు పుష్కలంగా కురిసి రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. పంట వేసే సమయంలో రైతుకు అండగా ఉండేందుకు రైతు భరోసా ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్థిక సాయం అందించిందని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయిలో నూతన క్రీడా పాలసీ ఏర్పాటుపై హర్షం.

వేములవాడ, జూన్ 5 (నేటినిజంప్రతినిధి): తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతనంగా క్రీడా పాలసీ ఏర్పాటు చేయడం అభినందనీయం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో క్రీడకారుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది అలాగే కేబినెట్ సబ్ కమిటీ సంబంధించిన జి . ఓ 911 నెంబర్ విడుదలకవడం పట్ల జిల్లా యువజన సంఘాలు అధ్యక్షుడు జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారులు సోమినేని బాలు,జిల్లా స్పోర్ట్స్ కరాటే ప్రధాన కార్యదర్శి ఎం ఏ . మన్నాన్ తెలిపారు . నూతన క్రీడా పాలసీ వలన ఔత్సాహిక క్రీడాకారులకు ఎంతో మేలు జరుగుతుందని , గ్రామీణ స్థాయి నుంచి క్రీడలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది .నైపుణ్యం గల క్రీడాకారులు క్రీడాకారులు వెలుగులోకి వస్తారని , కోచ్ ల నియామకం జరుగుతుఅందాని అలాగే సబ్ కమిటీ వలనక్రీడకరులకు ఆర్థికంగా ఆదుకునేల ప్రోత్సాహకాలు అందించేలా కొత్త పాలసీ ని మేము ఆహ్వానం పలుకుతున్నామని సోమినేని బాలు ,మన్నాన్ హర్షం వ్యక్తం చేయడం జరిగింది

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.